



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 11 సంచిక : 351 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ ఆదివారం 24 ఆగస్టు 2025 వెల : 5/-రూ॥

VOLUME : 11 ISSUE :351 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA SUN 24 AUGUST 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Kakinada,Visakhapatnam, Ongole Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur




## ఇండియా కూటమి అభ్యర్థికి చంద్రబాబు మద్దతిస్తారా?

- విశాఖ స్టీల్ ప్లాంట్‌పై కూటమి ప్రభుత్వం తన వైఖరి స్పష్టం చేయాలన్న బొత్స
- ఈ నెల 30న పవన్ కల్యాణ్ ఉక్కు పరిశ్రమపై మాట్లాడాలని డిమాండ్
- రాష్ట్రంలో అవినీతి, దౌర్జన్యాలు పెరిగిపోయాయని ఆరోపణ

పెన్ పవర్ డెస్క్:విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం పై అధికార కూటమి ప్రభుత్వం తన వైఖరిని తక్షణమే వెల్లడించాలని వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ డిమాండ్

వివరాలు 2లో..



# ఈ ప్రపంచంలో ఏదీ వృథా కాదు

- ఆలోచనా విధానం మారితేనే స్వర్ణాంధ్ర సాధ్యమన్న సీఎం
- అక్టోబర్ 2 నాటికి మున్సిపాలిటీలలో చెత్త పూర్తి తొలగింపునకు హామీ
- గత ప్రభుత్వం చెత్తపై పన్ను వేసి, తొలగింపును గాలికొదిలేసిందని విమర్శ
- పెద్దాపురంలో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేస్తామని ప్రకటన
- సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేసి చూపామని వెల్లడి
- సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వానికి రెండు కళ్లలాంటివని స్పష్టం




పెన్ పవర్ డెస్క్:రాష్ట్ర ప్రజల ఆలోచనా విధానంలో మార్పు వచ్చినప్పుడే స్వర్ణాంధ్ర నిర్మాణం సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. పరిశుభ్రమైన ఆలోచనలతోనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించగలమని ఆయన స్పష్టం చేశారు. శనివారం

వివరాలు 2లో..



### అన్ని స్థాయిలలో అవినీతి
## పెరిగిపోవడమే ఈ దుస్థితికి కారణం

- టీడీపీ కూటమి ప్రభుత్వంపై వైఎస్ జగన్ తీవ్ర స్థాయిలో విమర్శలు
- 14 నెలల్లోనే రూ.1.86 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపణ
- తమ ఐదేళ్ల పాలనలో చేసిన అప్పులో ఇది 56 శాతమని వెల్లడి
- రాష్ట్ర సొంత రాబడుల వృద్ధి కేవలం 3.08 శాతానికే పరిమితమైందని వ్యాఖ్య
- జీఎస్టీ, అమ్మకం పన్ను వసూళ్లు కూడా గత ఏడాదితో పోలిస్తే తగ్గాయని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి

వివరాలు 2లో..



## 2026లో తమిళనాడులో చరిత్ర సృష్టిస్తాం

- మధురై సభను విజయవంతం చేసిన మద్దతుదారులకు విజయ్ కృతజ్ఞతలు
- విమర్శల్లోని మంచిని మాత్రమే స్వీకరించి ముందుకు సాగుతామని వెల్లడి
- విభజన శక్తులకు, కపట రాజకీయాలకు తమ పార్టీ వ్యతిరేకమని స్పష్టీకరణ
- 1967, 1977 నాటి చారిత్రక తీర్పు 2026లో పునరావృతమవుతుందని ధీమా
- పని మాత్రమే రాజకీయాల మాతృభాష అని కీలక వ్యాఖ్య

వివరాలు 2లో..

## అనిల్ అంబానీకి బిగుస్తున్న ఉచ్చు... రంగంలోకి దిగిన సీబీఐ



- ఎస్బీఐకి రూ.2,000 కోట్లకు పైగా మోసం కేసు
- ముంబైలోని పలు ప్రాంతాల్లో సీబీఐ సోదాలు
- ఇటీవలే అనిల్ అంబానీని విచారించిన ఈడీ
- ఆర్‌కామ్‌ను 'ఫ్రాడ్'గా ప్రకటించిన ఎస్బీఐ

పెన్ పవర్ డెస్క్: ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి కష్టాలు మరింత పెరుగుతున్నాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణ ఎదుర్కొన్న కొన్ని రోజులకే, ఇప్పుడు సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) రంగంలోకి దిగింది. రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్), దాని ప్రమోటర్‌కు సంబంధించిన కార్యాలయాలపై శనివారం

వివరాలు 2లో..

## సైబర్ నేరగాళ్ల ఉచ్చుకి చిక్కిన మంత్రి నారాయణ అల్లుడు

- మంత్రి నారాయణ అల్లుడు పునీత్‌ను లక్ష్యంగా చేసుకున్న సైబర్ నేరగాళ్లు
- పునీత్ పేరుతో ఆయన కంపెనీ అకౌంటెంట్‌కు నకిలీ మెసేజ్
- అత్యవసరంగా రూ. 1.40 కోట్లు కావాలని సందేశం
- డబ్బు బదిలీ చేశాక మోసపోయినట్లు గుర్తించిన అకౌంటెంట్
- ఇద్దరిని అరెస్ట్ చేసిన పోలీసులు

పెన్ పవర్ డెస్క్:ఏపీ మంత్రి నారాయణ అల్లుడు పునీత్ కంపెనీని లక్ష్యంగా చేసు కుని, ఏకంగా రూ. 1.40 కోట్లు కాజేసిన కేటుగాళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లో నిందితులను అదుపులోకి

వివరాలు 2లో..



## దేశంలోనే రిచ్చెస్ట్ సీఎం చంద్రబాబు..

**ఏపీ ముఖ్యమంత్రి ఆస్తి ఎన్ని వందల కోట్లంటే..**



- ఏపీ ముఖ్యమంత్రి ఆస్తి 931 కోట్లు
- సెకండ్ ప్లేస్ లో అరుణాచల్ సీఎం
- ఫెమా ఖండు ఆస్తి రూ.332 కోట్లు
- దేశంలో ఈ ఇద్దరు సీఎంలు బిలియనీర్లు
- బెంగాల్ సీఎం మమత లీస్ట్
- ఆమె ఆస్తి కేవలం రూ.15 లక్షలే
- తాజా జాబితా విడుదల చేసిన ఏడీఆర్

పెన్ పవర్ డెస్క్: దేశంలోని అత్యంత సంపన్నుడైన ముఖ్యమంత్రిగా చంద్రబాబు నిలిచారు. ఆయన ఆస్తి రూ. 931 కోట్లని ఏడీఆర్ నివేదిక స్పష్టం చేసింది. అదే విధంగా చివరి స్థానంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ ఉన్నారు. ఆమె వద్ద

వివరాలు 2లో..

## అంతరిక్ష రంగంలో 'ప్రైవేట్'కు ప్రధాని మోదీ భారీ టార్గెట్

- రాబోయే ఐదేళ్లలో 5 యూనికార్న్‌లు సృష్టించాలని పిలుపు
- ప్రస్తుతం ఐదుగా ఉన్న రాకెట్ ప్రయోగాలను ఏటా 50కి పెంచాలని సూచన
- గత 11 ఏళ్ల సంస్కరణలతో 350 స్టార్టప్‌లు వచ్చాయన్న ప్రధాని
- సామాన్యుడి జీవితాన్ని స్పేస్ టెక్నాలజీ సులభతరం చేస్తోందని వెల్లడి
- త్వరలో గగన్‌యాన్, భారత సొంత స్పేస్ స్టేషన్ ఏర్పాటు లక్ష్యం

భారత అంతరిక్ష రంగంలో ప్రైవేట్ రంగం కీలక పాత్ర పోషించాలని, రాబోయే ఐదేళ్లలో కనీసం ఐదు యూనికార్న్‌లను సృష్టించాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఏడాదికి ఐదుగా ఉన్న రాకెట్ ప్రయోగాల సంఖ్యను 50కి పెంచే దిశగా కృషి చేయాలని ఆయన సూచించారు. శనివారం 'జాతీయ అంతరిక్ష దినోత్సవం' సందర్భంగా ప్రధాని వర్చువల్ విధానంలో దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.గత 11 ఏళ్లలో అంతరిక్ష రంగంలో భారత్ సాధించిన

వివరాలు 2లో..



## భవిష్యత్తులో పెరోల్ కోసం ఎవరికీ సిఫారసు చేయను.. నాకు ఇదో గుణపాఠం

- రౌడీషీటర్ శ్రీకాంత్ పెరోల్ కు సిఫారసు లెటర్ ఇచ్చిన కోటంరెడ్డి
- తన లేఖను తిరస్కరించిన 14 రోజుల తర్వాత పెరోల్ ఇచ్చారని వెల్లడి
- గతంలో వైసీపీ నేతలు కూడా అదే వ్యక్తికి సిఫారసు లేఖలు ఇచ్చారన్న కోటంరెడ్డి

పెన్ పవర్ డెస్క్:రౌడీషీటర్ శ్రీకాంత్ పెరోల్ వ్యవహా రంలో వైసీపీ తనపై ఉద్దేశపూ ర్వకంగా దుష్ప్రచారం చేస్తోందని నెల్లూరు టీడీపీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మండిపడ్డారు. ఈ వివాదం తనకు ఒక గుణపాఠం నేర్పిందని, భవిష్యత్తులో ఎవరికీ పెరోల్ కోసం సిఫారసు లేఖలు

వివరాలు 2లో..



## ఇది సహజంగా ఏర్పడిన కొరత కాదు... కూటమి నేతలు సృష్టిస్తున్న కృత్రిమ సంక్షోభం

- రాష్ట్రంలో యూరియా కొరత నెలకొందంటూ షర్మిల ఆరోపణలు
- బ్లాక్ మార్కెట్‌లో యూరియా బస్తా రూ. 500కు విక్రయిస్తున్నారని వెల్లడి
- రాష్ట్రానికి వచ్చిన యూరియా ఏమైందని ప్రభుత్వానికి ప్రశ్న
- రైతులకు వెంటనే యూరియా సరఫరా చేయాలని విజ్ఞప్తి

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో రైతులు తీవ్ర యూరియా కొరత ఎదుర్కొం టున్నారంటూ ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఇది సహజంగా ఏర్పడిన కొరత కాదని,

వివరాలు 2లో..



### యోగి చేశాడా.. అమిత్ షా చేశాడా..
## నేనెందుకు రాజీనామా చేయాలి?

- ప్రతిపక్ష ఎమ్మెల్యేల డిమాండ్ పై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ఫైర్
- బీజేపీ మంత్రులు రాజీనామా చేయలేదేమని ప్రశ్న
- చిన్నస్వామి స్టేడియం తొక్కిసలాట ఘటనపై అసెంబ్లీలో రచ్చ



పెన్ పవర్ డెస్క్:బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో జరిగిన తొక్కిస లాట ఘటన అంశం కర్ణాటక అసెంబ్లీని కుదిపేసింది. ఈ ఏడాది జూన్ 4న జరిగిన ఈ దురదృష్టకర ఘటనలో పదకొండు మంది చనిపోయిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా చేయాలని ప్రతిపక్ష

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# ఫ్యాన్ స్పీడ్

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణపై వైసీపీ పోరుకుసిద్ధమవుతుంది. ఈ మేరకు కార్యాచరణ రూపొందించుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సెంటిమెంట్ గా ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్ ను దశలవారీగా ప్రయివేటీకరణ చేయడానికి ప్రయత్నిస్తుందన్న కార్మిక సంఘాలకు వైసీపీ అండగా నిలవాలని నిర్ణయించింది. ఈ మేరకు మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఉత్తరాంధ్ర వైసీపీ నేతలు, విశాఖ కార్పొరేటర్లతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణ ను రూపొందించేందుకు సిద్ధమయ్యారు. 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పడిన విశాఖ స్టీల్ ప్లాంట్ ను కాపాడుకోవడానికి అన్ని రాజకీయ పార్టీలు తమ ఉద్యమంలో కలసి రావాలని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ పిలుపు నిచ్చారు.

**బలహీనంగా ఉండటంతో...**

ఉత్తరాంధ్రలో వైసీపీ బలహీనంగా ఉంది. గత ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో వైసీపీని ప్రజలు ఆదరించలేదు. జిల్లాలకు జిల్లాలే తుడిచిపెట్టుకుపోయాయి. ఈ నేపథ్యంలో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణను తమ భుజానకెత్తుకునేందుకు ఫ్యాన్ పార్టీ సిద్ధమయింది. ఇప్పటికే నిన్న విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో వైసీపీ కార్పొరేటర్లు వత్తిడి తెచ్చి విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానం చేసి రాష్ట్రప్రభుత్వానికి పంపారు. దాదాపు 32 డిపార్ట్ మెంట్లలో ఉద్యోగులను తొలగిస్తున్నందున పోరాటాన్ని ఉధృతం చేయాలని నిర్ణయించింది. దశలవారీగా ఈ పోరాటాన్ని ప్రారంభించాలని వైసీపీ నాయకత్వం కూడా నిర్ణయించింది.

**రాజకీయ పార్టీలతో కలిసి...**

వామపక్ష పార్టీలతో పాటు ఇతరగా కలసి వచ్చే రాజకీయ పార్టీలతో కలిసి ఉత్తరాంధ్రలోనే కాకుండా ఏపీ వ్యాప్తంగా ఉద్యమాన్ని విస్తరించాలన్న యోచనలో వైసీపీ ఉంది. ముందుగా స్థానిక నాయకత్వంతో కలసి పోరాటం చేయడంతో పాటు కార్మిక సంఘాలను అవసరమైతే ఢిల్లీకి తీసుకెళ్లి జంతర్ మంతర్ వద్ద ధర్నా చేయాలని దాదాపుగా నిర్ణయించినట్లు తెలిసింది. అలాగే వైసీపీ అధినేత వైఎస్ జగన్ కూడా విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మిక సంఘాలకు మద్దతుగా త్వరలోనే విశాఖకు వచ్చేందుకు కూడా పార్టీ నిర్ణయించినట్లు సమాచారం. మొత్తం మీద ఉత్తరాంధ్రలో తిరిగి నిలదొక్కుకునేందుకు వైసీపీ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణను ఆయుధంగా మలుచుకుంటుంది. మరి ఈ ఉద్యమం వైసీపీకి ఎంత మేరకు లాభిస్తుందన్నది చూడాలి.

## అన్ని స్థాయిలలో అవినీతి పెరిగిపోవడమే ఈ దుస్థితికి కారణం

- మొదటి పేజీ తరువాయి

ఆందోళనకరంగా ఉందని, ఆదాయం తగ్గిపోయి అప్పులు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆయన ఆరోపించారు. అన్ని స్థాయిలలో అవినీతి పెరిగిపోవడమే ఈ దుస్థితికి కారణమని ఆయన ఆరోపించారు. కాగ్ లెక్కల ఆధారంగా రాష్ట్ర ఆర్థిక దుస్థితిని వివరిస్తూ, టీడీపీ కూటమి ప్రభుత్వం కేవలం 14 నెలల కాలంలోనే రూ.1,86,361 కోట్ల అప్పు చేసిందని జగన్ పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన మొత్తం అప్పులో ఇది 56 శాతానికి సమానమని ఆయన పోల్చి చెప్పారు. ఎన్నికల ముందు రాష్ట్ర ఆదాయాన్ని పెంచుతామని, అప్పులను తగ్గిస్తామని హామీ ఇచ్చిన టీడీపీ కూటమి, ఇప్పుడు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అధికారం చేపట్టిన అనతికాలంలోనే ఇంత భారీగా అప్పులు చేయడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. రాష్ట్ర ఆదాయ వృద్ధి రేటుపై కూడా జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర సొంత రాబడుల (పన్ను, పన్నేతర) వృద్ధి కేవలం 3.08 శాతంగానే నమోదైందని తెలిపారు. దేశ జీడీపీ వృద్ధి 9.8 శాతంగా, కేంద్ర ప్రభుత్వ ఆదాయాల వృద్ధి 12.04 శాతంగా ఉన్నప్పుడు, రాష్ట్ర ఆదాయ వృద్ధి ఇంత తక్కువగా ఉండటం ఆర్థిక మందగమనానికి సూచిక అని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ 12.02 శాతం వృద్ధి చెందుతోందని ప్రభుత్వం చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని ఈ లెక్కలు చెబుతున్నాయన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) మొదటి నాలుగు నెలల్లో కూడా పరిస్థితి ఏమాత్రం మెరుగుపడలేదని జగన్ విమర్శించారు. వినియోగానికి సూచికలైన జీఎస్టీ, అమ్మకం పన్ను వసూళ్లు కూడా గత ఏడాదితో పోలిస్తే తగ్గాయని ఆయన వివరించారు. రాబడులు పడిపోవడం, అప్పులు ఖగోళ వేగంతో పెరగడం చూస్తుంటే, ప్రభుత్వం తన పాలనా విధానాలపై తీవ్రంగా పునరాలోచించుకోవాల్సిన అవసరం ఉందని జగన్ హితవు పలికారు.

## ఇది సహజంగా ఏర్పడిన కొరత కాదు... కూటమి నేతలు సృష్టిస్తున్న కృత్రిమ సంక్షోభం

- మొదటి పేజీ తరువాయి

అధికార పార్టీ నేతలు సృష్టిస్తున్న కృత్రిమ సంక్షోభమని ఆమె ఆరోపించారు. ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల కోసం రైతులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం రూ. 266కు అమ్మాల్సిన యూరియా బస్తాను బహిరంగ మార్కెట్‌లో రూ. 500కు అమ్ముతున్నారని, దీని వెనుక పెద్ద దందా నడుస్తోందని ఆరోపించారు. రాష్ట్రానికి ఇప్పటికే 6.34 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కోటా చేరినట్లు ప్రభుత్వం చెబుతోందని, మరి ఆ నిల్వలు ఏమయ్యాయని ఆమె ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. రైతులకు అందాల్సిన యూరియాను అక్రమంగా గోదాములకు తరలించి, బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు అమ్ముకుంటున్నారని ఆమె దుయ్యబట్టారు.రైతులు తెల్లవారుజాము నుంచే కిలోమీటర్ల మేర క్యూలలో నిలబడినా ఎరువులు దొరకడం లేదని, రైతు సేవా కేంద్రాల వద్ద 'నో స్టాక్' బోర్డులు దర్శనమిస్తున్నాయని షర్మిల తెలిపారు. వ్యవసాయ, విజిలెన్స్ శాఖలు ఈ అక్రమ రవాణాను ఎందుకు అడ్డుకోవడం లేదని నిలదీశారు. కూటమి ప్రభుత్వానిది సాగుకు పెద్దపీట వేయడం కాదని, రైతు మెడపై కత్తిపీట పెట్టడమేనని ఆమె ఘాటుగా విమర్శించారు. ఈ యూరియా సంక్షోభంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే స్పందించి సమాధానం చెప్పాలని కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు. బ్లాక్ మార్కెట్ దందాను తక్షణమే అరికట్టి, ప్రైవేట్ వ్యాపారులపై విజిలెన్స్ దాడులు నిర్వహించాలని కోరారు. యూరియాను అక్రమంగా నిల్వ ఉంచిన వారిపై నిత్యావసర వస్తువుల చట్టం (%జుజ ాాష్%) కింద కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్‌కు అదనంగా అవసరమైన 1.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను వెంటనే సొసైటీల ద్వారా రైతులకు సరఫరా చేసి ఆదుకోవాలని ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## భవిష్యత్తులో పెరోల్ కోసం ఎవరికీ సిఫారసు చేయను.. నాకు ఇదో గుణపాఠం

- మొదటి పేజీ తరువాయి

ఇచ్చే ప్రసక్తే లేదని ఆయన ప్రకటించారు. నెల్లూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ అంశంపై పూర్తి వివరణ ఇచ్చారు.శ్రీకాంత్ తండ్రి, సోదరుడు తనను కలిసి అభ్యర్థించడంతో ఒక ప్రజాప్రతినిధిగా సిఫారసు లేఖ ఇచ్చానని కోటంరెడ్డి తెలిపారు. ఇలాంటి లేఖలు ఇవ్వడం సాధారణమేనని, తుది నిర్ణయం అధికారులే తీసుకుంటారని స్పష్టం చేశారు. "నేను ఇచ్చిన లేఖను అధికారులు జులై 16వ తేదీనే తిరస్కరిస్తూ సమాచారం పంపారు. ఆ తర్వాత 14 రోజులకు, అంటే జులై 30న శ్రీకాంత్‌కు పెరోల్ మంజూరు చేశారు. నా లేఖను తిరస్కరించిన తర్వాత పెరోల్ ఎలా వచ్చిందో విచారణ జరిపించాలి" అని ఆయన డిమాండ్ చేశారు. హోంమంత్రి ఈ విషయంపై విచారణ జరిపిస్తున్నామని చెప్పడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు.గతంలో వైసీపీ హయాంలో ఇదే శ్రీకాంత్‌కు అప్పటి ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య సిఫారసు లేఖలు ఇచ్చారని, వాటి ఆధారంగానే అప్పుడు పెరోల్ మంజూరైందని కోటంరెడ్డి గుర్తుచేశారు. "సిఫారసు లేఖలు ఇవ్వడమే నేరంగా చిత్రీకరిస్తున్న వైసీపీ నేతలు, వారు అధికారంలో ఉన్నప్పుడు శ్రీకాంత్‌ను ఎలా బయటకు తెచ్చారో సమాధానం చెప్పాలి. ఎమ్మెల్యేలు లేఖలు ఇవ్వడాన్ని నేను తప్పుపట్టను, కానీ ఇప్పుడు నాపై బురద చల్లడం సరికాదు" అని ఆయన అన్నారు. ప్రతి అంశమూ రాజకీయ జీవితంలో ఒక గుణపాఠమేనని, ఇకపై ఇలాంటి విషయాల్లో ఆచితూచి వ్యవహరిస్తానని ఆయన పేర్కొన్నారు.

# ఈ ప్రపంచంలో ఏదీ వృథా కాదు

- మొదటి పేజీ తరువాయి

కాకినాడ జిల్లా పెద్దాపురంలో నిర్వహించిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' సభలో పాల్గొన్న ఆయన, ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ప్రపంచంలో ఏదీ వృథా కాదని, చెత్త నుంచి కూడా సంపదను సృష్టించవచ్చని అన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని సీఎం గుర్తుచేశారు. అపరిశుభ్రత కారణంగానే అంటువ్యాధులు ప్రబలుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత వైకాపా ప్రభుత్వం చెత్తపై పన్ను విధించిందే తప్ప, దానిని తొలగించే బాధ్యతను పూర్తిగా విస్మరించిందని ఆయన విమర్శించారు. "ప్రజారోగ్యాన్ని గత పాలకులు ఏమాత్రం పట్టించుకోలేదు. రాబోయే అక్టోబర్ 2వ తేదీ నాటికి రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలను చెత్త రహితంగా మారుస్తాం" అని చంద్రబాబు హామీ ఇచ్చారు. చెత్త నుంచి సంపద సృష్టించడంతో పాటు, ఈ-వేస్ట్‌ను రీసైక్లింగ్ చేసే విధానాలపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. ఈ సందర్భంగా పెద్దాపురంలో 100 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు.సంపద సృష్టించి, ప్రజల ఆదాయాన్ని పెంచడం తమ ప్రభుత్వానికి తెలుసని చంద్రబాబు అన్నారు. "అప్పులు చేసి సంక్షేమ పథకాలు అమలు చేస్తే అవి ఎక్కువ కాలం నిలవవు. సూపర్ సిక్స్ అసాధ్యమన్న వారి విమర్శలను తిప్పికొట్టి, దానిని సూపర్ హిట్‌గా మార్చాం" అని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద రైతులకు నగదు జమ చేస్తోందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తోందని వివరించారు. రాష్ట్రంలోని 40 వేల హెయిర్ కటింగ్ సెలూన్లకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని, పీ-4 కార్యక్రమం ద్వారా పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్నామని చెప్పారు.

"ప్రతి ఒక్కరి ఆదాయం పెరిగి, అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే నా ఆకాంక్ష" అని ముఖ్యమంత్రి తెలిపారు. సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేసుకుంటూ అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసేలా తమ ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## 2026లో తమిళనాడులో చరిత్ర సృష్టిస్తాం

తమిళనాడులో 2026 అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ చరిత్రాత్మక విజయం సాధించడం ఖాయమని తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత, ప్రముఖ నటుడు విజయ్ ధీమా వ్యక్తం చేశారు. 1967, 1977లలో ప్రజలు చారిత్రక తీర్పు ఇచ్చినట్టే, రాబోయే ఎన్నికల్లో ప్రజలు తమకు కూడా ఘన విజయాన్ని అందిస్తారని ఆయన అన్నారు. మధురైలో జరిగిన పార్టీ రెండో రాష్ట్రస్థాయి సమావేశం విజయవంతం కావడంపై ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మధురై సభను చరిత్రలో ఒక కీలక మలుపుగా అభివర్ణించిన విజయ్, సభకు తరలివచ్చిన జనసందోహాన్ని చూసి తన హృదయం గర్వంతో, ఆనందంతో నిండిపోయిందని తెలిపారు. "సముద్రమంతా మధురైలో కలిసినట్టుగా ప్రజలు తరలివచ్చారు. ఇంతటి ప్రేమను పొందడానికి నేనేం తపస్సు చేశానో అర్థం కావడం లేదు. మీరంతా నా కుటుంబంగా దొరికినందుకు ఆ భగవంతుడికి, ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా" అని ఆయన భావోద్వేగంగా పేర్కొన్నారు. తమ రాజకీయాలు ఎల్లప్పుడూ విభజన శక్తులకు, ప్రభుత్వంలోని కపట నాటకాలకు వ్యతిరేకంగానే ఉంటాయని విజయ్ స్పష్టం చేశారు. "మా స్పష్టమైన, రాజీలేని వైఖరిని ప్రజలు మనస్ఫూర్తిగా స్వాగతించారు. ఇకపై ఎలాంటి సంకోచం లేకుండా ముందుకు సాగుతాం. ఎందుకంటే, పనే రాజకీయాల మాతృభాష" అని ఆయన

అన్నారు. తమపై వచ్చే విమర్శల నుంచి కేవలం మంచిని మాత్రమే స్వీకరించి, ప్రతికూలతలను చిరునవ్వుతో తిప్పికొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశం విజయవంతం కావడానికి అహర్నిశలు శ్రమించిన పార్టీ ఆఫీస్ బేరర్లు, కోఆర్డినేటర్లు, కార్యకర్తలకు విజయ్ ధన్యవాదాలు తెలిపారు. తమ రాజకీయాలు ప్రజాస్వామ్య విలువలు, నిజాయతీ పునాదులపై ప్రజా కేంద్రకంగానే సాగుతాయని ఆయన పునరుద్ఘాటించారు. స్వచ్ఛమైన, ప్రజల కోసం పనిచేసే రాజకీయ అధికారాన్ని సాధించి తీరుతామని విజయ్ విశ్వాసం వ్యక్తం చేశారు.

## సైబర్ నేరగాళ్ల ఉచ్చుకి చిక్కిన మంత్రి నారాయణ అల్లుడు

- మొదటి పేజీ తరువాయి

తీసుకు న్నట్లు అధికారులు వెల్లడించారు.వివరాల్లోకి వెళితే, మంత్రి నారాయణ అల్లుడు పునీత్ పేరుతో ఆయన కంపెనీ అకౌంటెంట్‌కు సైబర్ నేరగాళ్లు ఓ సందేశం పంపారు. అత్యవసరంగా డబ్బు అవసరమని, వెంటనే తాను చెప్పిన బ్యాంకు ఖాతాకు రూ. 1.40 కోట్లు బదిలీ చేయాలని ఆ మెసేజ్‌లో సూచించారు.ఆ సందేశం నిజంగా పునీత్ నుంచే వచ్చిందని భావించిన అకౌంటెంట్, ఏమాత్రం ఆలస్యం చేయకుండా వారు చెప్పిన ఖాతాకు డబ్బును బదిలీ చేశారు. అయితే, కొద్దిసేపటి తర్వాత తాను మోసపోయినట్లు గ్రహించిన అకౌంటెంట్, వెంటనే పోలీసులను ఆశ్రయించారు. అకౌంటెంట్ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలతో నిందితుల జాడను కనిపెట్టారు. ఈ మోసానికి పాల్పడింది ఉత్తరప్రదేశ్‌కు చెందిన సంజీవ్, అరవింద్ అనే ఇద్దరు వ్యక్తులుగా గుర్తించి, వారిని అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు.

## అంతరిక్ష రంగంలో 'ప్రైవేట్'కు ప్రధాని మోదీ భారీ టార్గెట్

- మొదటి పేజీ తరువాయి

విజయాలను ప్రధాని కొనియాడారు. "భారత అంతరిక్ష ప్రయాణం మన శాస్త్రవేత్తల ప్రతిభ, నూతన ఆవిష్కరణలకు నిదర్శనం" అని ఆయన అన్నారు. ఒకప్పుడు నిబంధనలతో వెనుకబడిన అంతరిక్ష రంగానికి తమ ప్రభుత్వం ప్రైవేటు భాగస్వామ్యం కల్పించడం ఒక వరంగా మారిందని, ఇది వరుస విజయాలకు కారణమైందని మోదీ వివరించారు. ప్రభుత్వ సంస్కరణల ఫలితంగానే ఈ రంగంలో 350కి పైగా స్టార్టప్‌లు వచ్చాయని తెలిపారు. అంతరిక్ష సాంకేతికత ఇప్పుడు ప్రభుత్వ పరిపాలనలోనూ భాగమైందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. "పంటల బీమా పథకాల కోసం శాటిలైట్ ఆధారిత అంచనాలు, మత్స్యకారులకు ఉపగ్రహాల ద్వారా సమాచారం, విపత్తుల నిర్వహణ, పీఎం గతి శక్తి మాస్టర్ ప్లాన్‌లో జియోస్పేషియల్ డేటా వాడకం వంటివి సామాన్యుడి జీవితాన్ని సులభతరం చేస్తున్నాయి" అని ఆయన వివరించారు. భవిష్యత్ ప్రణాళికల గురించి మాట్లాడుతూ, శాస్త్రవేత్తల కృషితో త్వరలోనే భారత్ 'గగన్‌యాన్'

మిషన్‌ను ప్రయోగిస్తుందని, రాబోయే కాలంలో మన దేశం సొంతంగా అంతరిక్ష కేంద్రాన్ని (స్పేస్ స్టేషన్) కూడా నిర్మిస్తుందని మోదీ ధీమా వ్యక్తం చేశారు. అంతరిక్ష రంగంలో నూతన తరం సంస్కరణలను కొనసాగించేందుకు ప్రభుత్వానికి సంకల్పం ఉందని చెబుతూ, యువతకు అపార అవకాశాలు కల్పించే ఈ రంగం వృద్ధిలో పాలుపంచుకోవాలని ప్రైవేట్ సంస్థలను ప్రధాని ఆహ్వానించారు.

## అనిల్ అంబానీకి బిగుస్తున్న ఉచ్చు... రంగంలోకి దిగిన సీబీఐ

- మొదటి పేజీ తరువాయి

సీబీఐ అధికారులు దాడులు నిర్వహించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ)కు సుమారు రూ. 2,000 కోట్లకు పైగా నష్టం కలిగించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ రుణ మోసం కేసుకు సంబంధించి ఈ సోదాలు జరిగాయి. ముంబైలోని పలు ప్రాంతాల్లో ఏకకాలంలో ఈ దాడులు నిర్వహించినట్లు సీబీఐ వర్గాలు వెల్లడించాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మార్గదర్శకాల ప్రకారం, జూన్ 13నే ఆర్‌కామ్, అనిల్ అంబానీ ఖాతాలను ఎస్బీఐ 'ఫ్రాడ్'గా వర్గీకరించింది. తీసుకున్న రుణాలను దుర్వినియోగం చేశారని, నిధులను పలు గ్రూప్ కంపెనీలకు అక్రమంగా మళ్లించారని బ్యాంకు గుర్తించింది. తాము జారీ చేసిన షోకాజ్ నోటీసులకు ఆర్‌కామ్ ఇచ్చిన సమాధానాలు సంతృప్తికరంగా లేవని ఎస్బీఐ స్పష్టం చేసింది. ఆర్బీఐ నిబంధనల ప్రకారం, ఒక ఖాతాను ఫ్రాడ్‌గా గుర్తించిన 21 రోజుల్లోగా దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. ఇదిలా ఉండగా, కొన్ని రోజుల క్రితమే అనిల్ అంబానీని ఈడీ అధికారులు దాదాపు తొమ్మిది గంటల పాటు విచారించారు. సుమారు రూ. 17,000 కోట్ల రుణ మోసం కేసుకు సంబంధించి మనీలాండరింగ్ కోణంలో ఈ విచారణ జరిగింది. ఈ కేసులో తన ప్రమేయం ఏమీ లేదని, అన్ని ఆర్థిక నిర్ణయాలు కంపెనీ బోర్డు తీసుకుందని, తాను కేవలం సంతకాలు మాత్రమే చేశానని అంబానీ చెప్పినట్లు సమాచారం. ఈడీ దాడుల్లో కీలక పత్రాలు, హార్డ్ డ్రైవ్‌లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పుడు సీబీఐ కూడా దాడులు చేయడంతో అనిల్ అంబానీ చుట్టూ ఉచ్చు మరింత బిగుసుకుంటోంది.

## ఇండియా కూటమి అభ్యర్థికి చంద్రబాబు మద్దతిస్తారా?

- మొదటి పేజీ తరువాయి

చేశారు. విశాఖలో ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి నేతలు విస్మరించారని తీవ్రంగా విమర్శించారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోమని శాసనమండలిలో పవన్ కల్యాణ్, లోకేశ్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కానీ ఇప్పుడు 32 విభాగాలను ప్రైవేటు వ్యక్తులకు ఎందుకు అప్పగిస్తున్నారని ఆయన ప్రశ్నించారు.విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని నినదించిన నేతలు ఇప్పుడు మౌనంగా ఉండటం సరికాదన్నారు. ఈ నెల 30న విశాఖలో జరగనున్న జనసేన సమావేశంలో పవన్ కల్యాణ్ ఈ విషయంపై ప్రజలకు సమాధానం చెప్పాలని బొత్స డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ విశాఖ పర్యటనకు వచ్చినప్పుడు స్టీల్ ప్లాంట్ గురించి మాట్లాడకుండా, గిన్నిస్ బుక్ రికార్డులపై దృష్టి పెట్టారని ఎద్దేవా చేశారు. స్టీల్ ప్లాంట్ అంశాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లే బాధ్యత చంద్రబాబు, పవన్‌లకు లేదా? అని నిలదీశారు. ఉక్కు పరిశ్రమ పరిరక్షణ కోసం కార్మిక, ప్రజా సంఘాలను కలుపుకొని త్వరలోనే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని, అవసరమైతే ప్రధాని వద్దకు కూడా వెళతామని స్పష్టం చేశారు.రాష్ట్రపతి ఎన్నికల విషయంలో వైసీపీ వైఖరిని వివరిస్తూ, సంఖ్యాబలం ఉన్నప్పుడు ఏకగ్రీవ ఎన్నికకు తాము ఎప్పుడూ మద్దతిచ్చామని తెలిపారు. ఇండియా కూటమి అభ్యర్థికి చంద్రబాబు మద్దతిస్తారా? అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన అన్ని రంగాల్లో విఫలమైందని బొత్స సత్యనారాయణ

ఆరోపించారు. మంత్రులు, ఎమ్మెల్యేలపై అవినీతి ఆరోపణలు వస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో దోపిడీలు, దౌర్జన్యాలు, భూ కబ్జాలు పెరిగిపోయాయని విమర్శించారు. అర్హులైన దివ్యాంగుల పెన్షన్లను తొలగిస్తున్నారని, వారి సమస్యలపై ప్రభుత్వం మానవత్వంతో స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 30లోగా దివ్యాంగుల సమస్యలు పరిష్కరించకపోతే, కలెక్టర్లను కలిసి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## దేశంలోనే రిచ్చెస్ట్ సీఎం చంద్రబాబు..

- మొదటి పేజీ తరువాయి

కేవలం రూ. 15 లక్షల ఆస్తి మాత్రమే ఉన్నట్టు నివేదిక తేల్చింది. డిసెంబర్ 2024 తర్వాత జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు, ఉప ఎన్నికల తర్వాత రూపొందించిన అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ తాజాగా నివేదిక ఇచ్చింది. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు సీఎంలు దాఖలు చేసిన అఫిడవిట్‌లలో పేర్కొన్న డేటా ఆధారంగా ఈ జాబితా రూపొందించినట్టు స్పష్టం చేసింది.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు కూడా రూ.931 కోట్లకు పైగా ఆస్తులతో అగ్రస్థానంలో కొనసాగుతున్నారు, అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన పెమా ఖండు (రూ.332 కోట్లు) తర్వాతి స్థానంలో ఉన్నారు. ఈ ఇద్దరు మాత్రమే జాబితాలో బిలియనీర్లు. నివేదిక ప్రకారం, బెనర్జీ రూ.15 లక్షల ఆస్తులు ప్రకటించగా, జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా రూ.55 లక్షల ఆస్తులు కలిగి ఉన్నారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ రూ.1 కోటి కన్నా కొంచెం ఎక్కువ ఆస్తులతో చివరి నుంచి మూడో స్థానంలో ఉన్నారు. ఇదిలా ఉండగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆస్తి విలువ 30.10 కోట్లు అని ఏడీఆర్ నివేదిక పేర్కొంది.

**బెంగాల్ సీఎంకు ఇల్లు లేదు**

ఎన్నికల అఫిడవిట్ ప్రకారం పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి ఎలాంటి ఇల్లు, భూమి లేదు. 2020-21లో మమతా బెనర్జీ దాఖలు చేసిన ఆదాయపు పన్నురిటర్న్ , రూ. 15.4 లక్షలు. 2016 అసెంబ్లీ ఎన్నికల సమయంలో, ఆమె ఆస్తుల విలువ 30.40 లక్షలు.

ఆమె అఫిడవిట్‌లో తన వద్ద "చేతిలో నగదు" రూ. 69,255 అని, తన బ్యాంకు బ్యాలెన్స్ 13.5 లక్షలు ఉందని చెప్పారు. ఎన్నికల ఖర్చు ఖాతాలో1.50 లక్షలున్నట్టు పేర్కొన్నారు. 2019%-%20 సంవత్సరానికి గాను ఆమె పన్ను మినహాయింపు ద్వారా 1.8 లక్షలుగా చూపించారు. తన వద్ద 43,837 రూపాయల విలువైన 9 గ్రాముల బంగారం కూడా ఉందని వెల్లడించారు.

## యోగి చేశాడా.. అమిత్ షా చేశాడా.. నేనెందుకు రాజీనామా చేయాలి?

- మొదటి పేజీ తరువాయి

బీజేపీ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ పై సిద్ధరామయ్య స్పందిస్తూ.. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇలాంటి ప్రమాదాలు జరిగినపుడు అక్కడి ముఖ్యమంత్రులు రాజీనామా చేయలేదేమని ప్రశ్నించారు.

ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ లో కుంభమేళా సందర్భంగా తొక్కిసలాట జరిగి 39 మంది చనిపోయారని గుర్తుచేస్తూ.. నైతిక బాధ్యత వహిస్తూ యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఎందుకు రాజీనామా చేయలేదని నిలదీశారు. 2008లో హిమాచల్ ప్రదేశ్ లోని నైనా దేవీ ఆలయంలో తొక్కిసలాట జరిగి 162 మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారని, అప్పుడు కూడా ఆ రాష్ట్రాన్ని పాలించిన బీజేపీ సీఎం ప్రేమ్ కుమార్ ధుమాల్ కూడా రాజీనామా చేయలేదని గుర్తుచేశారు.

2008 సెప్టెంబర్ 30న రాజస్థాన్ లోని జోధ్ పూర్ చాముండి దేవీ ఆలయంలో తొక్కిసలాట జరిగి 250 మంది చనిపోయారని, అప్పుడు సీఎం పదవిలో ఉన్న బీజేపీ నేత వసుంధరా రాజే కూడా రాజీనామా చేయలేదని గుర్తుచేశారు. 2022లో ఐపీఎల్ టైటిల్ గెల్చుకున్న గుజరాత్ టైటాన్ జట్టు కరోనా వ్యాప్తి పీక్ స్టేజీలో ఉన్న సమయంలోనూ విజయోత్సవాలు జరుపుకుందని, అందులో సాక్షాత్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా కుటుంబం, గుజరాత్ సీఎం భూపేంద్ర పాటిల్ కూడా పాల్గొన్నారని చెప్పారు. ఓవైపు మహమ్మారి వేగంగా వ్యాపిస్తున్న సమయంలో విజయోత్సవాల పేరుతో భారీగా జనం గుమిగూడినా ఎవరూ నైతిక బాధ్యత వహించలేదని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య తీవ్రంగా మండిపడ్డారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎంతటి ఘోరం జరిగినా ఎవరూ నైతిక బాధ్యత వహించరు, బీజేపీ సీఎంలు, మంత్రులు రాజీనామా చేయరు కానీ కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాత్రం రాజీనామా చేయాలని అదే బీజేపీ నేతలు డిమాండ్ చేస్తారంటూ సిద్ధరామయ్య ఎద్దేవా చేశారు.

# బిజెపి రాష్ట్ర కార్యదర్శిగా ఈ. స్వప్న కుమారి....



**అడ్డతీగల, పెన్ పవర్, ఆగస్టు 23:** అడ్డతీగల మండలం వేటమామిడి గ్రామానికి చెందిన బిజెపి మహిళా నేత ఈ.స్వప్న కుమారి కి రాష్ట్ర కార్యదర్శిగా నియామకం జరిగింది. స్వప్న కుమారి ఇప్పటివరకు జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. స్వప్న కుమారి సేవలను గుర్తించి బిజెపి అధిష్టానం ఈమెకు రాష్ట్రస్థాయి పదవి ఇవ్వడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు







## పెద్దాపురంలో స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమానికి

# సీఎం చంద్రబాబు హాజరు



### హెలిప్యాడ్ వద్ద ఘన స్వాగతం

### ప్రజా ప్రతినిధులు ,జిల్లా ఉన్నతాధికారులు

**కాకినాడ స్టాఫ్ రిపోర్టర్, పెన్‌పవర్, ఆగస్టు 23:** పెద్దాపురంలో నిర్వహించిన "స్వర్ణ ఆంధ్రా – స్వచ్ఛ ఆంధ్రా" కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం లభించింది. పెద్దాపురం-సామర్లకోట రహదారిపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద సీఎం హెలికాప్టర్ దిగగానే మంత్రులు, ప్రజా ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు పలువురు ఘన స్వాగతం పలికారు. అనంతరం సీఎం, పెద్దాపురంలో జరుగుతున్న స్వర్ణ ఆంధ్రా%-%స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమానికి బయలుదేరారు. సీఎంకు స్వాగతం తెలిపిన వారిలో కాకినాడ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ, కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, మాజీ హెూంమంత్రి, స్థానిక ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు, కాకినాడ లోక్‌సభ సభ్యుడు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఉన్నారు. అదేవిధంగా జిల్లా స్పెషల్ ఆఫీసర్ జి. వీరపాండ్యాన్, కలెక్టర్ షన్మోహన్ సగిలి, ఏలూరు రేంజ్ డిఐజి జి.వి.జి .అశోక్ కుమార్,ఎస్పీ జి. బిందు మాధవ్, ప్రభుత్వ విప్‌లు తుని ఎమ్మెల్యే యనమల దివ్య, ముమ్మిడివరం ఎమ్మెల్యే డి. సుబ్బరాజు, శాసన మండలి సభ్యులు పెరాబత్తుల రాజశేఖర్, కర్రీ పద్మశ్రీ, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వర రావు (కొండబాబు),ప్రత్తిపాడు ఎమ్మెల్యే వి. సత్య ప్రభ, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, అనపర్తి ఎమ్మెల్యే ఎన్. రామకృష్ణ రెడ్డి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ టి. సుధీర్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), మాజీ మంత్రి చిక్కల రామచంద్రరావు, మాజీ జడ్పీ చైర్మన్ జ్యోతుల నవీన్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు తదితర ప్రజా ప్రతినిధులు, నాయకులు, స్థానిక ప్రజలు భారీగా హాజరై సీఎం పర్యటనకు విశేష ఆదరణ లభించేలా చేశారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన జనసందోహం, ఘన స్వాగతం మధ్య సీఎం కార్యక్రమం లో పాల్గొనడం పెద్దాపురంలో ఉత్సాహ పూరిత వాతావరణాన్ని నెలకొల్పింది.



# స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర విజయవంతంలో ప్రజల భాగస్వామ్యం కీలకం





### జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, ఆగస్ట్ 23:** స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర విజయవంతంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్, కమిషనర్(ఎఫ్.ఎ.సి.) పి.ప్రశాంతి అన్నారు. శనివారం ఉదయం స్థానిక కంబాల చెరువు పార్కు వద్ద స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజుతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, స్థానికులతో స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. తొలుత డ్రోన్ సాయంతో కంబాల చెరువులో దోమల మందును పిచికారీ చేశారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్సీ చేతులమీదుగా చెరువులో దోమల నివారణకు గంబూషియా చేపలను విడిచిపెట్టారు. దోమలు వృద్ధి కేంద్రాలను ఎప్పటికప్పుడు గుర్తించి లార్వా దశలోనే నియంత్రించడంపై దృష్టిసారించాలని ఈ సందర్భంగా పబ్లిక్ హెల్త్ సిబ్బందికి కలెక్టర్ సూచించారు. కాలువలు, కుంటల్లో ఆయిల్ బాల్స్ వేయడంతో పాటుగా రసాయనాలు పిచికారి చేయాలన్నారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా హ్యాండ్ స్ప్రేయింగ్ యంత్రాలను పెంచుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర – స్వచ్ఛంద్రా చేపట్టి స్వచ్ఛత కార్యక్రమాల విజయవంతం చేసుకోవడం జరుగుతోందని పేర్కొన్నారు. ఈనెల 3వ శనివారం బదులు 4వ శనివారం నిర్వహిస్తున్నట్లు, ఇందులో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమన్నారు. ప్రభుత్వ పరంగా చేపట్టిన కార్యక్రమాలపై ప్రజలను చ్చైతన్యవంతులను చేసి వాటిని విజయవంతం చేయడం ద్వారా అనుకున్న లక్ష్యాలను చేరుకోగలమన్నారు. అలాగే ప్రజల్లో ఈ-వ్యర్థాలపై(ఎలక్ట్రానిక్ వ్యర్థాలు) అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర %-% స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టిందని, తద్వారా ఈ-వ్యర్థాలను సేకరించి శాస్త్రీయ పద్ధతుల్లో తొలగించేందుకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలు తమ ఇళ్లలో పాడైన ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఇంట్లో ఉంచుకోవడం ద్వారా లేదా విచ్చలవిడిగా బహిరంగ ప్రదేశాల్లో పారవేయడం వల్ల వాయుకాలుష్యం పెరుగుతుందని కలెక్టర్ అన్నారు. క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశముందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత సమస్యను అరికట్టేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ-వ్యర్థాల సేకరణ కేంద్రంలో అందజేస్తే వాటిని సరైన రీతిలో రీసైక్లింగ్ చేసి ముప్పు లేకుండా తొలగించడం జరుగుతుందన్నారు. కనుక ఎలక్ట్రానిక్ పరికరాలు వినియోగించే ప్రతిఒక్కరూ రెడ్యూస్, రీయూజ్, రీ సైకిల్ అనే మూడు విషయాలను గుర్తుంచుకోవాలని కోరారు. అలాగే సింగిల్ యూజ్ ప్లాస్టిక్స్ నిషేధాన్ని నగరంలో సమర్థవంతంగా అమలు చేసి పర్యావరణాన్ని పరిరక్షించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా వార్డులో నిరుపయోగంగా ఈ వెస్ట్, ఫైల్స్ హేతుబద్ధత విధానంలో డిస్పోజ్ చెయ్యాలని స్పష్టం చేశారు. తదుపరి ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ఒక బృహత్తరమైన కార్యక్రమం అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వాతావరణంలో వచ్చే మార్పులను అధిగమించేందుకు ప్రతీ పౌరుడు సామాజిక బాధ్యతగా మొక్కలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మానవాళి మనుగడ పచ్చదనం పరిఢవిల్లితేనే సాధ్యమవుతుందన్న విషయాన్ని ప్రతిఒక్కరూ గ్రహించాలన్నారు. ప్రకృతిని ప్రేమించడం, ప్రకృతితో కలిసి జీవించడం ద్వారానే మనిషి మనుగడ సరైన మార్గంలో ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. మొక్కలు నాటడంతో భారీ ఉష్ణోగ్రతలను నియంత్రించ వచ్చని, కనుక ప్రతిఒక్కరూ మొక్కలను సంరక్షించి జీవావరణాన్ని కాపాడాలని కోరారు. అలాగే ప్లాస్టిక్ వాడకం పెనుభూతం లాంటిదని, పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వాడకం నిషేధాన్ని గట్టిగా అమలు చేయకుంటే మన భావితరాలకు పెనుముప్పు తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, సెక్రటరీ జి.శైలజావల్లి, ఎస్‌ఈ(ఇంజనీరింగ్) ఎం.సీహెచ్ కోటేశ్వరరావు, సిటీ ప్లానర్ జి.కోటయ్య, మేనేజర్ ఎండి అబ్దుల్ మాలిక్, ఈఈలు మాధవి, రీటా, మదర్సా అలీ, సీఎంఎం రామలక్ష్మి, అకౌంటెంట్ నాగమణి, ఇతర మున్సిపల్ అధికారులు, పబ్లిక్ హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

# మూడు పోస్టులకు అర్హత సాధించిన ఉంగరాల మణికంఠ చంద్రశేఖర్



**గోకవరం, పెన్ పవర్, ఆగస్టు 23 :** రంప ఎర్రంపాలెం గ్రామానికి చెందిన ఉంగరాల మణికంఠ చంద్రశేఖర్ శనివారం విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో టి జి టి, ఎస్ జి టి, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు అర్హత సాధించడం జరిగింది. 2018లో జరిగిన డీఎస్సీలో మణికంఠచంద్రశేఖర్ మొదటిసారి ప్రయత్నించి స్వల్ప తేడాతో అవకాశాన్ని కోల్పోవడం జరిగింది. అప్పటినుండి ఇప్పటివరకు ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో నిరంతరము సాధన చేసి కాకినాడలోని కోచింగ్ సెంటర్లో కోచింగ్ తీసుకుని 2025 డీఎస్సీలో టీజీటీ, ఎస్జిటి, స్కూల్ అసిస్టెంట్, మూడు విభాగాల ఉపాధ్యాయ ఉద్యోగాలకు పరీక్ష రాయగా మూడింటిలోనూ అర్హత సాధించి ఉపాధ్యాయుడు కావాలి అనేటటువంటి తన కలను నెరవేర్చుకున్నాడు. స్కూల్ అసిస్టెంట్ గా హై స్కూల్ మ్యాథ్స్ టీచర్ గా చేరాలని నిర్ణయించుకున్నానని మణికంఠ చంద్రశేఖర్ తెలిపాడు. ఏకకాలంలో మూడు ఉద్యోగాలకు అర్హత సాధించడంపట్ల మణికంఠ చంద్రశేఖర్ తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేయగా గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

# ప్రత్తిపాడులో ఎస్ఎఫ్ఐ ర్యాలీ





- విద్యారంగ సమస్యలు పరిష్కరించాలంటూ చలో ఎమ్మార్వో ఆఫీస్

**ప్రత్తిపాడు, పెన్ పవర్, ఆగష్టు 23 :**ప్రత్తిపాడు మండలంలో విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చలో ఎమ్మార్వో ఆఫీస్ ర్యాలీ నిర్వహించారు. వందలాది మంది విద్యార్థులు పాల్గొన్న ఈ ర్యాలీలో ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి. శ్రీకాంత్ తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా హాస్టళ్లలో మెస్సు, కాస్మెటిక్స్ చార్జీలు విడుదల కాలేదని, రాష్ట్రంలో ?6400 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని ఆయన తెలిపారు. "తల్లికి వందనం" పథకం సగం శాతం విద్యార్థులకే అందలేదని ఎద్దేవా చేశారు. ప్రత్తిపాడులో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని, పాడైపోయిన పాఠశాల భవనాలను కూల్చి కొత్త భవనాలు నిర్మించాలని, జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ప్రతి పాఠశాలలో ఆర్వో ప్లాంట్ సదుపాయం కల్పించాలని, విద్యార్థులపై భారంగా మారిన జీవో 77ని రద్దు చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా భారీ ఉద్యమం చేస్తామని శ్రీకాంత్ హెచ్చరించారు. ఈ ర్యాలీలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కే. సిద్దు, మండల కార్యదర్శి నరసింహ, నాయకులు శివమణి, భానుబాబు, నాని, అశోకు, హరి, పండు, వంశి, రాణి, అనూష తదితరులు పాల్గొన్నారు.



## దాతలచే బస్ షెల్టర్ ప్రారంభం



**అమలాపురం రూరల్, పెన్ పవర్, ఆగష్టు 23:** అమలాపురం మండలం పేరూరు. పేరూరుపేట జంక్షన్ లో కలిగినీడి త్రినాధ రావు గారి ప్రథమ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులచే ప్రారంభించినటువంటి బస్సు షెల్టర్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ఈ షెల్టర్ ని ప్రారంభించిన నాలం సూరిబాబు మరియు త్రినాధ రావు, సోదరులు కు అందరూ ధన్యవాదాలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో త్రినాధ రావు కుమారులు సుబ్బారావు సత్యనారాయణ (సత్తిబాబు) మాచరబాబు అలాగే మనవలు కుటుంబ సభ్యులందరూ కూడా పాల్గొన్నారు.

## శ్రీ విజేత లో ఆంధ్ర కేసరి జయంతి



**తాళ్లపూడి, పెన్ పవర్, ఆగష్టు 23:**ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా తాళ్లపూడి లోని శ్రీ విజేత హై స్కూల్ నందు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు డా జొన్నకూటి ప్రమోద్ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రకాశం చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రకాశం జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. తెల్లవాడి తుపాకీ కి గుండెలు చూపి దమ్ముంటే నన్ను కాల్చండి రా..అంటూ గర్జించి తెలుగు వాడి ధైర్య సాహసాన్ని చాటిన మహోన్నత వ్యక్తి ప్రకాశం అని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల అకడమిక్ ఇంచార్జ్ కె కరుణ, ఉపాధ్యాయులు ఆలీ, విజయ్, కరిష్మా, గంగారత్నం, సలోమి, మేరీ కిరణ్మయి, చంద్రిక పాల్గొన్నారు.

## ఘనంగా స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర

- భావితరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి





**సీతానగరం, పెన్ పవర్, ఆగష్టు 23:** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ దివస్ లో భాగంగా ప్రతి నెల మూడవ శనివారం పారిశుధ్య నిర్వహణను సీతానగరం మండలంలోని జ్ఞాననిధి విద్యానికేతన్ స్కూల్ విద్యార్థులతో స్కూల్ నుంచి బస్టాండ్ వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞాన నిధి విజ్ఞానికేతన్ కరస్పాండెంట్ ప్రసన్న మాట్లాడుతూ వర్షాకాలంలో సీజన్ వ్యాధులు వచ్చే అవకాశం లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలో భాగంగా వ్యాధులు గురించి దోమల గురించి అవగాహన కల్పిస్తూ రోజువారి తాగే నీళ్లు కాచి చల్లార్చిన నీళ్లు తాగాలని చెప్పారు. పరిసరాల పరిశుభ్రత హ్యాండ్ వాష్ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సీతానగరం ఎస్సై డి. రామ్ కుమార్ మాట్లాడుతూ ఇంకుడు గుంతల పునరుద్ధరణ నిర్వహించారు. పెరుగుతున్న ఎండల తీవ్రత దృశ్య తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు చర్యలు నీటిని పొదుపుగా వాడుకోవాలని జీవన వేడిని తగ్గించడానికి జీవవైవిధ్యాన్ని ప్రోత్సహించడానికి రూట్ టాప్ గార్డెన్ ను చెట్ల పెంపకం ప్రోత్సహించడం విడివిడిగా ఇవ్వడం ప్లాస్టిక్ కవర్లు సంచులు స్థానంలో దుస్తులు సంచులు కాగితపు గ్లాసులు తదితరాలు ఉపయోగించడం పై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు, ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, జ్ఞాన నిధి విజ్ఞానికేతన్ ఉపాధ్యాయులు,ఉపాధ్యాయనీయులు, తదితరులు పాల్గొన్నారు,

## జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, ఆగస్ట్ 23:**తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు ఆంధ్ర రాష్ట్ర మొట్ట మొదటి ముఖ్యమంత్రి ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 153వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించిన అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) ఎన్.బి.ఎం.మురళీకృష్ణ, అడిషనల్ ఎస్పీ(ఏఆర్) ఎల్.చెంచి రెడ్డి. శనివారం రాజమహేంద్రవరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధులు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన చేసిన త్యాగాలను స్మరించుకుంటూ వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ఆయన చూపిన తెగువ, ధైర్యం, నిరుపమానం, సైమన్ గో బ్యాక్ అంటూ బ్రిటీష్ వారి తుపాకీ గుండ్లకు ఎదురు నిలిచి ఆంధ్రకేసరిగా పేరు పొందినారన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు విశేష కృషి చేశారన్నారు. ఆయన నిరుపేద కుటుంబం నుండి వచ్చి ముఖ్యమంత్రి అయిన వ్యక్తిగా, తన ధైర్యం, పట్టుదల ద్వారా ఆంధ్ర రాష్ట్ర చరిత్రలో ఒక ముఖ్యమైన స్థానాన్ని సంపాదించుకున్నారని కొనియాడారు. వారి ఆశయసాధనకు ప్రతిఒక్కరం కృషిచేద్దాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి(ఎస్.బి) బి.రామకృష్ణ, ఇన్స్పెక్టర్(డి.సి.ఆర్.బి) పవన్ కుమార్ రెడ్డి, ఆర్ఐ సంజీవ్ కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జగన్మోహిని కేశవ స్వామి ఆలయ అభివృద్ధికి భక్తుల విరాళం

వందలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.







**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 23:**డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో పురాతన దేవాలయమైన శ్రీ జగన్మోహిని కేశవ%-%గోపాలస్వామి ఆలయంలో శనివారం విశేష రద్దీ నెలకొంది. వందలాదిగా భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వాడపల్లి శేషాచార్యులు స్వామివారికి విశిష్ట పూజా కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. దర్శనం అనంతరం భక్తులు తీర్ధ ప్రసాదాలు స్వీకరించి ఆలయ అభివృద్ధి కోసం విరాళాలు సమర్పించారు. హన్మకొండకు చెందిన తేజావత్ నిఖిల్ కుటుంబ సభ్యులు రూ.10,010 విరాళం సమర్పించగా, గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండపాటూరు గ్రామానికి చెందిన రావిపూడి వెంకట సుబ్బారావు%-%సుశీల దంపతులు రూ.10,116 విరాళం సమర్పించారు. అలాగే రాజమహేంద్రవరానికి చెందిన చింతా శ్రీనివాసరెడ్డి%-%కనకదుర్గ దంపతులు రూ.11,106 విరాళాన్ని సమర్పించారు. వీరిని ఆలయ వేద పండితులు అవధాని వేద ఆశీర్వచనం చేయగా ఆలయ అధికారి దత్తు స్వామి వారి చిత్రపటం చరిత్ర కలిగిన పుస్తకం శేష వస్త్రంతో సత్కరించారు.

# సురక్షిత ప్రయాణాలపై అవగాహన సదస్సు






**అంబాజీపేట, పెన్ పవర్, ఆగష్టు23:** కోనసీమ కన్స్యూమర్ ఫెడరేషన్ అధ్యక్షులు అరిగెల బలరామమూర్తి అధ్యక్షతన అంబాజీపేట జిల్లా ఉన్నత పాఠశాల నందు రహదారి జాగ్రత్తలు, ఆహారం పై అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ కార్యక్రమమునకు జిల్లా పౌర సరఫరాల అధికారి ఏ. ఉదయ భాస్కర్, జిల్లా రవాణా శాఖ అధికారి డి శ్రీనివాస్ జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ వై. రామయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏ. ఉదయ భాస్కర్ మాట్లాడుతూ రహదారి ప్రయాణాలు అత్యంత కీలకమైనదని, ప్రాణాలు చాలా విలువైనవి సురక్షితంగా ప్రయాణం చేయాలన్నారు. ప్రాణాలను రక్షించుకోవాలని, ఆక్సిడెంట్లకు తావులేని విధంగా రహదారి నిబంధనలు పాటించాలని సూచించారు. వై. రామయ్య మాట్లాడుతూ ఆహార తయారిలో కల్తీ గా మారిపోయిందని వాటి విషయంలో పూర్తి జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. జిల్లా రవాణా శాఖ అధికారి డి. శ్రీనివాస్ మాట్లాడుతూ బైక్ రైడింగ్ చేస్తూ పిల్లలు పట్టుబడినట్లైతే పనిష్మెంట్ పిల్లలకు కాకుండా వాళ్ళ తల్లిదండ్రులకు సివియర్ గా ఉంటుందని, అందువల్ల మైనార్టీ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని, మేజర్ అయిన పిల్లలు కూడా లైసెన్సు ఉంటేనే రోడ్డు మీదకు రావాల్సి ఉంటుందని, లేనియెడల పిల్లలకు బైక్ ఇచ్చిన తల్లిదండ్రులకు పనిష్మెంట్ ఉంటుందని తెలియజేశారు. ప్రతి ఒక్కరు నిబంధనలు పాటించి ప్రయాణం చేయాలన్నారు. ఈ సందర్భంగా అధికారులు అందరూ విద్యార్థులతో సహా ర్యాలీ నిర్వహించి ప్రజలలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో డిసిపిసి సభ్యులు బివివి సత్యనారాయణ, ఎస్ ఐ చిరంజీవి, మాలే శ్రీనివాస్ నగేష్, నాగాబత్తుల సుబ్బారావు, అద్దంకి అమరేశ్వర రావు, ఎన్. నాగభూషణం, మాచవరం గ్రామ సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, హైస్కూల్ ఉపాధ్యాయ లు, వర్తక సంఘ ప్రతినిధులు , విద్యార్థిని విద్యార్థులు అవగాహన సదస్సు లో పాల్గొన్నారు. .

# రేషన్ డీలర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం



**గోకవరం, పెన్ పవర్, ఆగస్టు 23 :** స్థానిక తహసీల్దార్ కార్యాలయం నందు శనివారం మండలంలోని రేషన్ డీలర్లకు మండల సివిల్ సప్లై డిప్యూటీ తాసిల్దార్ శాంతి ప్రియ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి తాసిల్దార్ రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో తహసీల్దార్ , డిప్యూటీ తహసీల్దార్ లు రేషన్ డీలర్లకు పలు సూచనలు ,ఆదేశాలు ఇవ్వడం జరిగింది. కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రేషన్ పంపిణీలో సరికొత్త విధానాలను అవలంబించడం జరుగుచున్నదని, త్వరలో ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డు స్థానంలో ఏటీఎం కార్డుల తరహాలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. క్యూఆర్ కోడ్ తో కూడిన స్మార్ట్ కార్డులను ప్రభుత్వం పేదలకు పంపిణీ చేయడం జరుగుతుందని, ఈ పంపిణీ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు , గ్రామ సచివాలయ అధికారుల పాటు రేషన్ డీలర్లు తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఒరిజినల్ కీ రిజిస్టర్ లో ఎవరు పేరు అయితే నమోదు కాబడిందో ఆ రేషన్ షాప్ ద్వారానే క్యూఆర్ స్కాన్ కోడ్ స్కానింగ్ చేయాలని, ఇది తప్పనిసరిగా ప్రతి ఒక్క డీలర్ పాటించాలన్నారు. ఈనెల 25వ తారీఖున వృద్ధులకు వితంతువులకు రేషన్ పంపిణీ తో పాటు స్మార్ట్ కార్డుల పంపిణీ ప్రారంభం కానున్నదని తెలిపారు. 15 రోజుల్లో క్యూఆర్ కోడ్ స్కానింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. అధునాతన ఈ పోస్ యంత్రాలు, స్మార్ట్ యాఫ్ ద్వారా సమగ్ర సమాచారం ప్రజలకు అందుబాటులోకి రానుందని తెలిపారు. జిల్లా రేషన్ డీలర్ల అధ్యక్షులు బుంగ రాజు పలు సమస్యలను అధికారులకు తెలియజేశారు. డీలర్ల సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని తహసీల్దార్ రామకృష్ణ, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ శాంతి ప్రియ హామీ ఇచ్చారు.

## కలెక్టరేట్‌లో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, ఆగస్ట్ 23:** కలెక్టరేట్ ప్రాంగణంలో శనివారం మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు పాల్గొని ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో ప్రకాశం పంతులు త్యాగం అపూర్వం, ఆయన చూపిన నిజాయితీ, ధైర్యం, ప్రజాసేవ మార్గం నేటి తరానికి మార్గదర్శకం అన్నారు. ప్రజల హక్కుల కోసం పోరాడిన ఆయన ఆలోచనలు సమాజంలో న్యాయం, సమానత్వం సాధనకు ప్రేరణనిస్తాయి అని పేర్కొన్నారు. మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో పాల్గొని బ్రిటీష్ వారిని ఎదిరించి తుపాకికి గుండెను చూపిన ఆయన సాహసం ఎన్నటికీ మరువలేం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామ మూర్తి, జిల్లా సర్వే అధికారి బి.లక్ష్మీ నారాయణ, ఏవో అలీ, డీఎస్వో వి.పార్వతి, ఇతర శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## డీఎస్సీలో ప్రతిభ కనబరిచిన పాలింగి అనూష...



**కపిలేశ్వరపురం, పెన్ పవర్ 23.** కపిలేశ్వరపురం మండలం వడ్లమూరు గ్రామానికి చెందిన పాలింగి అనూష ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో 86.39 మార్కులు సాధించి, జిల్లాలో 69వ ర్యాంకు, ఎస్సీ కేటగిరీలో 5వ ర్యాంకు సాధించింది. నిరుపేద కుటుంబంలో జన్మించిన అనూష, గ్రామానికి చెందిన పాలింగి శ్రీనివాస్%-%బేబీ దంపతుల రెండవ సంతానం. చిన్నప్పటి నుంచే చదువుపై ఆసక్తి కనబరిచిన ఆమె, వడ్లమూరు మండల ప్రజా పరిషత్ పాఠశాలలో 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు చదివి, 8వ తరగతి నుండి 10వ తరగతి వరకు కాలేరు ఉన్నత పాఠశాలలో అభ్యసించింది. అనంతరం రామచంద్రపురం మోడరన్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివి 928 మార్కులు సాధించింది. డీఎసెట్‌లో రాష్ట్ర స్థాయిలో 89వ ర్యాంక్ సాధించి, బొమ్మూరు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ డైట్ సెట్ కాలేజీలో విజయవంతంగా పూర్తి చేసింది. సాధారణ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని నడిపిన తండ్రి శ్రీనివాసరావు, కూతురి విద్య కోసం కష్టపడి నిలబడ్డాడు. ఇద్దరు ఆడపిల్లలు ఉన్నా, వెనుకడుగు వేయకుండా వారిద్దరికీ ఉన్నత విద్య అందించేందుకు తల్లిదండ్రులు పాటుపడ్డారు. అనూష సాధించిన ఈ విజయం పట్ల ఆమె భర్త చంద్రశేఖర్, కుటుంబ సభ్యులు, స్థానికులు, ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, దళిత సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## మద్దిపట్ల శివరామకృష్ణని ఘనంగా సత్కరించిన టీడీపీ నాయకులు



**కొవ్వూరు, పెన్ పవర్, ఆగస్ట్ 23:** కొవ్వూరు అర్బన్ బ్యాంకు అధ్యక్షులుగా దీర్ఘకాల సేవలు అందిస్తూ, డిపాజిట్లదారులకు ధైర్యంతో పాటుగా డివిడెంట్లు ఇస్తూ, కొవ్వూరు ప్రజల నమ్మకాన్ని గెలిచిన మద్దిపట్ల శివరామకృష్ణ ఆగస్టు 15వ తేదీన జిల్లా కలెక్టర్ చేతులు మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా కొవ్వూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాతో సత్కరించటం జరిగింది. ఈ నేపథ్యంలో యువగళం నాయకులు కాకర్ల సత్యేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఇలాంటి ఎన్నో పురస్కారాలు భవిష్యత్ లో అందుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని అన్నారు. మీ అనుభవాలు కొవ్వూరు నియోజకవర్గ పరిధిలో ఉన్న నూతన సొసైటీ అధ్యక్షులందరికి ఉపయోగపడాలని, నష్టాల్లో ఉన్న సొసైటీలన్ని తిరిగి లాభాల్లోకి వెళ్లాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కొవ్వూరు నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, టీడీపీ కొవ్వూరు టౌన్ ప్రెసిడెంట్ దాయిన రామకృష్ణ, అన్నదేవరపేట, రాగోలపల్లి సొసైటీల అధ్యక్షులు జి.వి.ప్రసాద్, అనపర్తి ప్రసాద్, టీడీపీ యువ నాయకులు కూచిపూడి గణపతి తదితరులు శివరామకృష్ణని సత్కరించిన వారిలో ఉన్నారు.

## గణేష్ ఉత్సవ కమిటీతో అడ్డతీగల సీఐ ,ఎస్ఐ సమావేశం ...



**అడ్డతీగల, పెన్ పవర్ ,ఆగస్టు 23:** శనివారం అడ్డతీగల సీఐ బి. నరసింహామూర్తి ఎస్సై వినోద్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. గణేష్ విగ్రహ ప్రతిష్ట మండపాల నియామకాల గురించి నియమ నిబంధనలను వారికి వివరించారు. గణేష్ మండపాలు నిర్వహించేవారు, కచ్చితంగా గణేష్ ఉత్సవ్ వెబ్సైట్ లో లాగిన్ అయ్యి నియమాల ప్రకారం అనుమతి పొందాలని తెలియజేశారు. గణేష్ మండపాలు పెట్టే స్థలము యొక్క అనుమతులు కొరకు ఆయా పంచాయతీల్లో కచ్చితంగా అనుమతులు పొందాలని, ప్రైవేట్ వ్యక్తులకు సంబంధించిన స్థలంలో విగ్రహ ప్రతిష్ట చేస్తే స్థల యజమాని తో కచ్చితంగా అనుమతి పత్రం పొంది ఉండాలని, మండపం ఏర్పాటు చేసే చోట కరెంట్ విషయములో కచ్చితంగా ఎలక్ట్రిసిటీ వారి అనుమతి పొందాలని ,ఊరేగింపు సమయంలో మైక్ సెట్ లు గాని డీజే లు కానీ వాడ రాదని వీటికి నుమతులు లేవని అడ్డతీగల సీఐ బి .నరసింహామూర్తి తెలిపారు. గణేష్ విగ్రహం నిమజ్జన సమయంలో తీసుకెళ్లే వాహనం వివరాలు మరియు ఏ ప్రదేశం వద్ద నిమజ్జనం చేస్తున్నారో ఆ యొక్క వివరాలు కూడా పోలీసు వారికి ముందుగా తెలియజేయాలని ,పై నియమ నిబంధనలను ఉల్లంఘించి మండపాలు ఏర్పాటు చేసినచో,వారిపై చట్టపైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ,అడ్డతీగల సీఐ బి.నరసింహామూర్తి గణేష్ నిమజ్జన కమిటీ సభ్యులకు తెలియజేశారు. ఈ నియమ నిబంధనలు అడ్డతీగల మండలం లోని 22 పంచాయతీలకు 99 గ్రామాలకు ఈ నియమ నిబంధనలు వర్తిస్తాయని సీఐ తెలిపారు. గల గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులను అందర్నీ పిలిచి వారితో సమావేశమై ఈ క్రింది విధంగా గణేష్ విగ్రహ ప్రతిష్ట మండప నియమాలను వారికి వివరించారు.

## విద్యా బాల మందిర్ లో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం



**కొత్తపేట, పెన్ పవర్, ఆగస్టు23:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం, కొత్తపేట విద్యా బాల మందిర్ హైస్కూలు లో కరస్పాండెంట్ ఆర్. అనురాధ ఆధ్వర్యంలో "స్వచ్ఛ ఆంధ్ర%-%స్వర్ణాంధ్ర" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అసెంబ్లీ లో ప్రతిజ్ఞ చేసి, పరిశుభ్రత పై అవగాహన కల్పించే ర్యాలీ నిర్వహించారు.

జీవశాస్త్రం ఉపాధ్యాయురాలు బూసి శ్యామల మాట్లాడుతూ వర్షాకాలంలో పాటించవలసిన పరిశుభ్రతా జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. తరచూ చేతులను సబ్బుతో కడుక్కోవడం, వేడి నీటిని త్రాగడం, తాజా ఆహారం తీసుకోవడం, దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులు నివారించుకోవడం వంటి అంశాలను ఆమె సూచించారు. ముఖ్యంగా నీటి ద్వారా వ్యాప్తి చెందే కలరా, టైఫాయిడ్ వంటి వ్యాధుల నివారణకు అందరూ జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నూకపేయి శివరత్నం, సుధాకర్, హుస్సేన్, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అన్నదేవరపేటలో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముప్పిడి





**తాళ్ళపూడి, పెన్ పవర్, ఆగస్ట్ 23:** మండలంలోని అన్నదేవరపేట గ్రామంలో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించిన కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు.

కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ఒక బృహత్తరమైన కార్యక్రమం అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వాతావరణంలో వచ్చే మార్పులను అధిగమించేందుకు ప్రతీ పౌరుడు సామాజిక బాధ్యతగా మొక్కలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతిని ప్రేమించడం, ప్రకృతితో కలిసి జీవించడం ద్వారానే మనిషి మనుగడ సరైన మార్గంలో ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. మొక్కలు నాటడంతో భారీ ఉష్ణోగ్రతలను నియంత్రించ వచ్చని, కనుక ప్రతిఒక్కరూ మొక్కలను సంరక్షించి జీవావరణాన్ని కాపాడాలని కోరారు. అలాగే ప్లాస్టిక్ వాడకం పెనుభూతం లాంటిదని, పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వాడకం నిషేధాన్ని గట్టిగా అమలు చేయకుంటే మన భావితరాలకు పెనుముప్పు వాటిల్లే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.వి.ప్రసాద్, కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణపతి, ముళ్ళపూడి శ్రీరామచంద్ర మూర్తి, కైగాల శ్రీను, కాకర్ల శ్రీను, మద్దిపాటి ప్రకాశం, గజ్జరం దత్తుడు, అనపర్తి ప్రసాద్, కొప్పాక జవహర్ విజయానంద కుమార్, నామా నాని, ఉప్పులూరి రమేష్, దొడ్డపనేని గాంధీ, అన్నమరెడ్డి సత్తిబాబు, అన్నమరెడ్డి రమణ, తిగిరిపల్లి కనకరత్నం కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### స్వర్ణాంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనందరావు






**అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 23 :** స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్రలి కార్యక్రమంలో భాగంగా మాన్సూన్ హైజీన్ ( వర్షాకాలంలో పరిశుభ్రత ) అనే నినాదంతో అమలాపురం పురపాలక సంఘం ఆధ్వర్యంలో అమలాపురం పట్టణంలోని కిమ్స్ హాస్పిటల్ మెయిన్ రోడ్డు నుండి ఎర్రవంతెన వరకు అవగాహన ర్యాలీను నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు అయితాబత్తుల ఆనందరావు పాల్గొని, మొదటగా పారిశుద్ధ్య కార్మికులను సత్కరించి, మెయిన్ రోడ్డులోని శుభ్రం చేసిన మేజర్ డ్రైన్ ను పరిశీలించి, అక్కడ నుండి ఎర్రవంతెన వరకు స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర అవగాహన ర్యాలీని నిర్వహించి, ఎర్రవంతెన వద్ద శాసన సభ్యులు అయితాబత్తుల ఆనందరావు,ప్రజాప్రతినిదులు,మున్సిపల్ సిబ్బంది, సచివాలయం, మెప్మా సిబ్బంది, పట్టణ ప్రజలచేత స్వచ్ఛత ప్రతిజ్ఞను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, వ్యాదుల నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని,ఇంటి పరిసరాలలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పట్టణ ప్రజలకు సూచించారు. అమలాపురం పురపాలక సంఘం ద్వారా ఇప్పటికే పట్టణంలోని మేజర్ , మీడియం డ్రైనులలో పూడికలు తీయించి,శుభ్రం చేయించడం జరిగినదని,ప్రతి రోజు మైనర్ డ్రైన్స్ ను శుభ్రం చేయించడం జరుగుతుందని, దోమలు వృద్ధి చెందే కుంటలలో రసాయనాలు పిచికారి చేయడం జరుగుతుందని, త్రాగు నీటి వనరులను శుద్ధి చేసి, ప్రతి రోజు క్లోరినేషన్ చేసి పట్టణ ప్రజలకు సరపరా చేయడం జరుగుతుందని, కమిషనర్ వి.నిర్మల్ కుమార్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి రెడ్డి సత్య నాగేంద్రమణి,అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, వార్డు కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు మున్సిపల్, సచివాలయం, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

# యూరియా కొరతను వెంటనే నివారించాలి - కౌలూరి పతిరాజు

- ప్రత్తిపాడులో కిసాన్ సంఘ్ జిల్లా కమిటీ సమావేశం
- యూరియా కొరతతో రైతులు గగ్గోలు పెడుతున్నారన్న నేతలు




**ప్రత్తిపాడు, పెన్ పవర్,ఆగస్టు 23 :** ప్రత్తిపాడు మునసబు రామాలయంలో శనివారం జరిగిన భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కమిటీ సమావేశంలో రైతు సమస్యలు ప్రధాన చర్చాంశంగా నిలిచాయి. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కౌలూరి పతిరాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ జిల్లాలో యూరియా కొరత తీవ్రమైందని, ఇది రైతులు పొలాలకు ఎరువులు వేసుకునే అత్యంత కీలక సమయం కాబట్టి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా మాట్లాడుతూ, గత ఏడాది డిసెంబర్‌లో తుఫాన్ కారణంగా కిర్లంపూడి మండలంలోని గోనేడ, పాలెం, సోమరాయణంపేట వంటి గ్రామాల్లో పంటలు ముంపునకు గురయ్యాయని, కానీ ఇప్పటికీ రైతులకు నష్టపరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధ్యక్షుడు నీలగిరి చిట్టిబాబు మాట్లాడుతూ జిల్లాలో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు వాలిపోవడంతో తీగలు పొలాల్లో పడిపోతున్నాయని, దీంతో రైతుల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోందని అన్నారు. అలాగే విద్యుత్ శాఖ లైన్లు వేసే పేరుతో చెట్లను అనుమతి లేకుండా నరుకుతున్నారని, ఇలాంటివి కొనసాగితే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. జిల్లా కోశాధికారి కంపరపు నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో భూ సమస్యలు పెద్ద ఎత్తున పెరుగుతున్నాయని, గ్రామ, మండల స్థాయిలో సర్వేయర్ల పనితీరు సరిగా లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే కిసాన్ సంఘ్ ఉద్యమాలకు దిగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యల్లపు సూర్యనారాయణ మాట్లాడుతూ ఈనెల 29న భాద్రపద శష్ఠి రోజున రైతుల ఆరాధ్యదైవం భగవాన్ బలరాముల జయంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా రైతులు "రైతు దినోత్సవం"గా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రచారక్ కొండబాబు మాట్లాడుతూ గ్రామ కమిటీల నియామకం త్వరగా పూర్తి చేసి వారికి శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఆకుల హరిబాబు, సభ్యులు పంది వీరభద్రరావు, కందా వీరాస్వామి, చింతాకుల రామకృష్ణ, సింగిలిదేవి అప్పారావు, కుంచే నాగేశ్వరరావు, బందిల అంకాలుబాబు తదితరులు పాల్గొన్నారు.

# వంద శాతం హాజరుకు కృషి చేయండి





**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 23:** పాఠశాలల్లో విద్యార్థు లకు నాణ్యమైన విద్యాబోధనతోపాటు వంద శాతం విద్యా ర్థులు హాజరయ్యేలా ఉపాధ్యాయులంతా కృషి చేయాలని ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. 54మంది విద్యార్థులకు 46 మంది హాజరయ్యారని పూర్తిస్థాయిలో పిల్లలు హాజర య్యేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయ హాజరు తప్పనిసరిగా ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు .ఉపాధ్యాయుల డైరీలు, లెసన్ ప్లాన్స్ పరిశీలించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు 45 రోజులపాటు కార్యాచరణ ప్రణాళిక తయారుచేసి ఏ గ్రేడులోకి వచ్చే విధంగా చర్యలు చేప ట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం వంటకాలను రుచి చూసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు చిన్నారెడ్డి ,యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కృష్ణ ఉపాధ్యాయులు ఉన్నారు.

# బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు




గంగవరం ఎస్సై వెంకటేష్

**గంగవరం, పెన్ పవర్ ,ఆగస్టు 23:**బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన మద్యం సేవించి వాహనం నడిపిన కఠిన చర్యలు తప్పవని గంగవరం ఎస్సై వెంకటేష్ హెచ్చరించారు. శనివారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రక్కన బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించిన ముగ్గురిపై కేసు నమోదు చేసి రంపచోడవరం కోర్టులో హాజరుపరచగా 3600 జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ నెలలో జాతీయ రహదారిలో ప్రమాదాల నివారణ కొరకై పలుచోట్ల వాహనాలు తనిఖీ చేపట్టి ఓవర్ స్పీడ్ హెల్మెట్ ధరించకపోవడం డాక్యుమెంట్ లేకపోవడం వంటి నిబంధనలను మించిన వారిపై 52 ఈ చలానాలను విధించి సుమారు 45 వేల రూపాయలు జరిమానా వసూలు చేయడం జరిగిందన్నారు. ఆటో యూనియన్ సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి రోడ్డు ప్రమాదాలు నివారణ పై అవగాహన కల్పించడం జరిగిందని ముఖ్యంగా గోల్డెన్ అవర్ కాన్సెప్ట్ ప్రమాదం జరిగిన మొదటి గంట ప్రాధాన్యతను డ్రైవర్లకు వివరించడం జరిగిందన్నారు. జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణ కోసం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని ఆయన హెచ్చరించారు.

# ఆది కర్మయోగి పై సమావేశం



**వై రామవరం, పెన్ పవర్,ఆగస్టు 23 :** శనివారం మండల పరిషత్ కార్యాలయం నందు ఆది కర్మయోగి పై సమావేశం నిర్వహించడం జరిగిందని ఎంపీడీవో కే. బాపన్న దొర తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గిరిజన ప్రాంతాలను అభివృద్ధి దిశగా చేయుటకు అందరూ ఉద్యోగులు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. సచివాలయం సిబ్బంది ప్రతి గ్రామంలో రోడ్లు విద్యా వైద్యం త్రాగునీరుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలియజేసారు. గిరిజనుల సహాయ సహకారాలతో విలేజ్ విజన్ మ్యాప్ ను తయారు చేయాలని శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ మాస్టర్ ట్రైనర్ కే బాపన్న దొర, ఐ మణికంఠ, సుందరి,తాతబ్బాయి దొర, ఎస్ ఎస్ ఎస్ రాజు, లావన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు
, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు అని తెలిపారు.

# ఏఎంసి చైర్మన్ శ్రీరామ్ ని సత్కరించిన జి.వి.ప్రసాద్





**చాగల్లు, పెన్ పవర్, ఆగస్ట్ 23:**కొవ్వూరు నియోజకవర్గ ఏఎంసి చైర్మన్ గా నాదేళ్ల శ్రీరామ్ చౌదరి, వైస్ చైర్మన్ గా రేఖపల్లి మంగామణి, డైరెక్టర్లు ఈ నెల 21వ తేదీ గురువారం సాయంత్రం అతిరథమహారథుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవం అత్యద్భుతంగా జరిగింది. నియోజకవర్గంలో ట్రాక్టర్ల ర్యాలీ కార్యక్రమం అంచనాలకు మించి ఒక పండుగ వాతావరణంలో జరిగింది. ఈ నేపథ్యంలో అన్నదేవరపేట సొసైటీ చైర్మన్ జి.వి.ప్రసాద్ కొవ్వూరు నియోజకవర్గ ఏఎంసీ చైర్మన్ నాదేళ్ల శ్రీరామ్ చౌదరిని శనివారం చాగల్లులో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో యువగళం నాయకులు కాకర్ల సత్యేంద్ర ప్రసాద్, కూచిపూడి గణపతి, మద్దిపట్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు..

# గుడేళ్ల నాగేంద్రగౌడ కుటుంబాన్ని పరామర్శించిన: కరుటూరి నరసింహారావు

**ఆ కుటుంబ సభ్యులకు మనోధర్యాన్ని నింపిన కరటూరి**





**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 23:** ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన మండల టిడిపి ప్రధాన కార్యదర్శి గుడేళ్ల నాగేంద్రగౌడ తల్లి గుడేళ్ల సత్యవతి ఇటీవల మరణించడంతో ఆ కుటుంబంలో విషాద వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో కోనసీమ నీటి ప్రాజెక్టు వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు శనివారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు.
ముందుగా సత్యవతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు, అనంతరం ఆ కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ర్యాలి గ్రామ టిడిపి అధ్యక్షుడు పెండెం వెంకన్న, బూతు ఇన్చార్జులు అత్తిలి వెంకట్, పల్లెటి నరసయ్య, అత్తిలి చిరంజీవి, గ్రామ మాజీ సర్పంచ్ పల్లెటి ధనలక్ష్మి, గౌడ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# అన్నదేవరపేటలో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముప్పిడి



**తాళ్ళపూడి, పెన్ పవర్, ఆగస్ట్ 23:**మండలంలోని అన్నదేవరపేట గ్రామంలో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించిన కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు. కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ఒక బృహత్తరమైన కార్యక్రమం అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వాతావరణంలో వచ్చే మార్పులను అధిగమించేందుకు ప్రతీ పౌరుడు సామాజిక బాధ్యతగా మొక్కలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతిని ప్రేమించడం, ప్రకృతితో కలిసి జీవించడం ద్వారానే మనిషి మనుగడ సరైన మార్గంలో ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. మొక్కలు నాటడంతో భారీ ఉష్ణోగ్రతలను నియంత్రించ వచ్చుని, కనుక ప్రతిఒక్కరూ మొక్కలను సంరక్షించి జీవావరణాన్ని కాపాడాలని కోరారు. అలాగే ప్లాస్టిక్ వాడకం పెనుభూతం లాంటిదని, పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వాడకం నిషేధాన్ని గట్టిగా అమలు చేయకుంటే మన భావితరాలకు పెనుముప్పు వాటిల్లే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.వి.ప్రసాద్, కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణపతి, చెవ్వూరి బంగార్రాజు, ముళ్ళపూడి శ్రీరామచంద్ర మూర్తి, కైగాల శ్రీను, కాకర్ల శ్రీను, మద్దిపాటి ప్రకాశం, గజ్జరం దత్తుడు, అనపర్తి ప్రసాద్, కొప్పాక జవహర్ విజయానంద కుమార్, నామా నాని, ఉప్పులూరి రమేష్, దొడ్డపనేని గాంధీ, అన్నమరెడ్డి సత్తిబాబు, అన్నమరెడ్డి రమణ, తిగిరిపల్లి కనకరత్నం కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మందపల్లి శ్రీ మందేశ్వర స్వామి ఆలయంలో రూ.3.65 లక్షల ఆదాయం





**కొత్తపేట, పెన్ పవర్, ఆగస్టు23:**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట మండలం, మందపల్లి గ్రామంలో వెలసియున్న శ్రీ మందేశ్వర స్వామి వారి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన తైలాభిషేకముల ద్వారా రూ.3,12,790 రూపాయలు ఆదాయం నమోదు కాగా, భక్తులు సమర్పించిన అన్నప్రసాద విరాళాల ద్వారా రూ.52,960 రూపాయలు లు లభించాయి.
మొత్తం వెరసి రూ.3,65,750 రూపాయలు ఆదాయం వచ్చినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. ఆలయాన్ని దర్శించుకున్న భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ వివరాలను సహాయక మిషనర్ కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్ బాబు ప్రకటించారు.

# పరిశుభ్రత మొక్కల పెంపకం ప్రతి ఒక్కరి బాధ్యత







ఎంఈఓ 2 మల్లేశ్వరరావు

**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 23:**ప్రతి పౌరుడు సామాజిక బాధ్యతగా పరిసరాల పరిశుభ్రత మొక్కల పెంపకం చేపట్టాలని మండల విద్యాశాఖ అధికారి 2 మల్లేశ్వరరావు సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు ఉన్నత పాఠశాల ,గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించి, స్థానిక వై జంక్షన్లో మానవహారం చేపట్టి, ప్రతిజ్ఞ చేపట్టి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈఓ మల్లేశ్వరరావు మాట్లాడుతూ ప్రకృతిని ప్రేమించడం ప్రకృతితో కలిసి జీవించడం ద్వారానే మనిషి కూడా సరైన మార్గంలో ముందుకు సాగుతుందన్నారు మొక్కలు నాటడంతో భారీ ఉష్ణోగ్రతలు నియంత్రించవచ్చని అన్నారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకం ప్రతి ఒక్కరూ మానుకోవాలని మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీ రాములు దొర ,వరలక్ష్మి, పిడి తిరుపతిరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వినాయక ఉత్సవ మండపాలు, ఊరేగింపుకు అనుమతి తప్పనిసరి

జగ్గంపేట ఎస్ఐ రఘునాథరావు



**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 23:** వినాయక చవితి సందర్భంగా మండల గ్రామాల్లో ఏర్పాటు చేసే వినాయక ఉత్సవ మండపాలు, ఊరేగింపుకు తప్పనిసరిగా పోలీసు అనుమతి తీసుకోవాలని జగ్గంపేట ఎస్సై టి.రఘునాథరావు అన్నారు. శనివారం ఆయన పెన్ పవర్ ప్రతినిధితో మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలకు సంబంధించి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగిల్ విండో విధానం అనుసరించాలన్నారు. గణేష్ ఉత్సవాలు నిర్వహించే కమిటీ సింగిల్ విండో విధానం ద్వారా అనుమతి పొందాలన్నారు. దరఖాస్తు చేసుకున్న తర్వాత పోలీసులు ఉత్సవ ప్రాంగణాన్ని పరిశీలించి అనుమతులు జారీ చేస్తారన్నారు. ఈ అంశాన్ని కమిటీ సభ్యులందరూ తప్పనిసరిగా పాటించాలని ఎస్సై రఘునాథరావు పేర్కొన్నారు.ు

## “మెగా డీఎస్సీ 2025లో తాడేపల్లిగూడెం కీర్తి పతాకం”



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్ ఆగస్టు 23 :**మెగా డీఎస్సీ-2025 ఫలితాల్లో తాడేపల్లిగూడెం విద్యార్థిని తన ప్రతిభతో చరిత్ర సృష్టించింది. నంబర్-2 జోన్ (మూడు జిల్లాల పరిధి)లో ఉన్న ఏకైక ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టుకు తాడేపల్లిగూడెం కు చెందిన వి. వేణు మాధురి ఎంపిక కావడం సంచలనంగా మారింది. రాష్ట్ర విద్యాశాఖ శుక్రవారం రాత్రి ఫలితాలను విడుదల చేసింది.

మూడు జిల్లాలకు ఒక్క పోస్టు మాత్రమే ఉండగా, వేలాదిమంది పోటీ పడిన ఈ పరీక్షలో వేణు మాధురి ఒక్కరే ఎంపికై “చదువుల తల్లి”గా నిరూపించుకుంది. గత 7%-%8 ఏళ్లుగా టీచర్ నియామకాలు జరగకపోవడంతో అభ్యర్థులు ప్రాణాలన్నీ పణంగా పెట్టి బరిలో నిలిచారు. అలాంటి పరిస్థితిలో ఒకేసారి మూడు విభాగాల్లో విజయం సాధించడం వేణు మాధురి ప్రతిభకు నిదర్శనం.

స్కూల్ అసిస్టెంట్ పోస్టులో జిల్లా స్థాయిలో 11వ ర్యాంక్,

సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులో జిల్లా స్థాయిలో 17వ ర్యాంక్

ఒకే పరీక్షలో మూడు విభాగాల్లో రాణించడం అరుదైన ఘనతగా నిలిచింది.

వేణు మాధురి తండ్రి మోహనరెడ్డి స్కూల్ అసిస్టెంట్ టీచర్‌గా, తల్లి శ్రీలక్ష్మి ప్రైమరీ స్పెషల్ స్కూల్ హెచ్ఎమ్‌గా, సోదరి అనుచందన నరసాపురం మున్సిపాలిటీలో ప్రభుత్వ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

ఈ విజయంపై డిప్యూటీ ఈఓ రామాంజనేయులు, పలువురు ఉపాధ్యాయ సంఘాలు వేణు మాధురికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## భవన కార్మికుల పెండింగ్ క్లెయిమ్స్ విడుదల చేయాలి - ఏఐటీయూసీ డిమాండ్



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్ ఆగస్ట్ 23 :**

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు భవన నిర్మాణ కార్మికుల పోరాటం కొనసాగుతుందని ఏఐటియుసి పట్టణ భవన నిర్మాణ కార్మిక సంఘం కోశాధికారి కోడే సాయి బాలాజీ స్పష్టం చేశారు.

గొల్లగూడెం హౌసింగ్ బోర్డ్ బాలదుర్గమ్మ గుడి సెంటర్ వద్ద మంగళవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు భవన కార్మికులు సిఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం కొణిదల పవన్ కళ్యాణ్ గార్లకు లేఖలు రాసి పెండింగ్లో ఉన్న 46 వేల క్లెయిమ్స్ వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం రామిశెట్టి శ్రీను, గాది తాతముని, రామిశెట్టి నాగు ఆధ్వర్యంలో జరిగింది.

ఈ సందర్భంగా కోడే సాయి బాలాజీ మాట్లాడుతూ –

%“గత సంవత్సరం కాలంగా కార్మికులు ఎంతో ఆశతో కూటమి ప్రభుత్వాన్ని ఎదురుచూస్తున్నారు. క్లెయిమ్స్ విడుదల అవుతాయని నమ్మకం పెట్టుకున్నారు. కానీ ఇప్పటికీ ఆగమనం జరగలేదు. భవన కార్మికుల సంక్షేమం కోసం పెండింగ్లో ఉన్న 46 వేల క్లెయిమ్స్ తక్షణం విడుదల చేయాలని సిఎం, డిప్యూటీ సిఎం గారు అధికారులను ఆదేశించాలని మేము కోరుతున్నాం. అప్పుడే నిజమైన మంచి రోజులు వస్తాయి” అని స్పష్టం చేశారు.

## మట్టి వినాయకుని పూజిద్దాం- పర్యావరణాన్ని కాపాడుదాం






డిఆర్ఓ కొత్త మాధవి

**అమలాపురం, పెన్ పవర్ ఆగస్టు 23:** మట్టి వినాయకుడిని పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదామని ఆర్డిఓ కె మాధవి ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఆర్డిఓ కార్యాలయము నందు ఈనెల 27 నుండి సెప్టెంబర్ 4 వరకు నిర్వహించనున్న వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్ల పై వివిధ మండలాల తాహసిల్దార్లు, ఉత్సవ కమిటీ పెద్దలు ,సర్కిల్ ఇన్స్పెక్ట ర్లతో సమీక్షించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించు కొని పూజకు అందరూ మట్టి వినాయక ప్రతిమలను వినియోగించి పర్యావరణాన్ని పరిరక్షించాలనీ మనం చేసే పూజల వల్ల మనకు మన తోటి వారికి, సమాజానికి కూడా మేలు కలిగినప్పుడే భక్తి,ముక్తి, ఆనందమని, ఆడంబరాలకు పోయి ప్రకృతికి హాని కలిగించే ఖరీదైన రంగుల ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారు చేసిన విగ్రహాలు వినియోగించి పర్యావరణానికి హాని చేయ వద్దని హితవు పలికారు. మట్టిలో నీటిలో త్వరిత%శీ%గా కరిగిపోయే మట్టి వినాయక ప్రతిమలను వినియోగించాలని, ఇతర పదార్థాలతో చేసిన విగ్ర హాలు వినియోగించి మన భావితరాలకు ముప్పు కొనితేవడం మంచిది కాదని, పర్యావరణ సంబంధమైన వినాయక చవితి పర్యావరణ హితంగా జరిపి ప్రకృతిని కాపాడాలన్నారు.విజ్ఞులైన ప్రతి ఒక్కరు బాధ్యత తో ఈ విషయమై శ్రద్ధ వహించి పర్యావరణ పరిరక్షణకు నడుంకట్టాలని పిలుపు నిచ్చారు. ఈ విషయం పై ప్రజలలో అవగాహన పెరగాలన్నారు. యువత స్వచ్ఛంద సంస్థలు, నాయ కులు మట్టి వినాయక ప్రతిమలు వినియోగించే విధంగా ప్రజలలో అవగాహన కల్గించి పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలన్నారు.ప్రకృతికి నచ్చేలా గణపతి మెచ్చేలా వినాయక చవితి ఉత్సవాల్లో కాలుష్యానికి చెక్ పెట్టి, పర్యావరణ హితంగా పండగలు జరుపుకొనేలా ప్రజలను జాగృత%శీ% చేయాలన్నారు. భావితరాలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలంటే పర్యావరణ హితమార్గాలను అనుసరించాలన్నారు.చవితి ఉత్స వాల్లోనూ మట్టి ప్రతి మలను పూజించి ప్రకృతి శోభతో ఆధ్యాత్మిక వాతావరణంలో పండగను జరుపుకునేలా ప్రోత్సహించాలన్నారు. వినాయకుడి విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరన్నారు. వినాయకుడి విగ్ర హాలు ఏర్పాటు చేసుకునే ప్రజలు తప్పని సరిగా అనుమతులు పొందాలన్నారు.మైక్ సెట్,ఎలక్ట్రిసిటీ,ఉపయోగిం చుకునేందుకు అనుమతులు తప్పనిసరని,అంతే కాకుండా విగ్రహం ఏర్పాటు చేసే కమిటీ మెంబర్ల పూర్తి సమాచారం ముందుగానే పోలీసులకు ఇవ్వాల్సి ఉంటుందని ఎన్ని రోజులు విగ్రహం ఏర్పాటు చేస్తారో,ముందుగానే తెలియ జేయాలన్నారు.స్థానిక పోలీస్ స్టేషన్ లో పూర్తి సమాచారం తెలియజేస్తూ లిఖితపూర్వకంగా అందించాలన్నారు.విగ్రహం ఏర్పాటు చేసే ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా ఉం చాలన్నారు,ఈ కార్య క్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్లు ప్రశాంత్ వీర బాబు డిఎల్పిఓ బుజ్జిబాబు తాసిల్దార్లు సిఐలు పలు ఉత్సవ కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

## అమరావతి ఛాంపియన్‌షిప్ కు భీమనపల్లి హైస్కూలు విద్యార్థులు ఎంపిక



**అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 23** :జాతీయ క్రీడా దినోత్సవం 2025 పురస్కరించుకుని అమరావతి ఛాంపియన్ షిప్ కప్ లో జిల్లాస్థాయి ఎంపికలలో అమలాపురం క్రీడాపాదికార సంస్థనందు జరిగిన పోటీలలో జిల్లా జట్టుకు భీమనపల్లి విద్యార్థులు ఎంపికయ్యారు . వీరు జోనల్ స్థాయి పోటీల్లో కాకినాడ డీ ఏ ఎస్ ఏ గ్రౌండ్ నందు జరుగు పోటీలలో ఆగస్టు 22 నుండి జరుగు పోటీల్లో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయులు నూకల సత్యనారాయణ తెలిపారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమానికి విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులను ఎంపీటీసీ శ్రీమతి దేశశెట్టి నాగరత్నకుమారి అభినందించారు. వాలీబాల్ జడ్డు నిధి సూర్య సత్యశ్రీ, (కబడ్డీ)కసిరెడ్డి భవ్య శ్రీ, యాళ్ల ప్రియనందన,చేట కాళ్ళ జోషిత వర్షినీ,అథ్లెటిక్స్ రాకుర్తి సిరి సత్య ప్రశాంతి, దాసరి సత్య,బాలు,అనిల్, సతీష్ సందీప్,ధీరజ్, శివ ఎంపికయ్యారన్నారు. అభినందన కార్యక్రమంలలో వ్యాయామ ఉపాధ్యాయులు కామన మధుసూదన రావు కరాటం ప్రసాద్,స్టాఫ్ సెక్రటరీ నడింపల్లి పద్మనాభన్, కె భాగ్యలక్ష్మి,వేటూరి,చల్లా రమణ పాల్గొన్నారు.

## శృంగార వల్లభ స్వామి ఆలయంలో భక్తుల రద్దీ

**పెద్దాపురం, పెన్ పవర్, ఆగస్ట్ 23 :** పెద్దాపురం మండలం తిరుపతి గ్రామంలో కొలువై తొలి తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన శ్రీదేవీ, భూదేవీ సమేత శృంగార వల్లభ స్వామి వారి దివ్యక్షేత్రం శనివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీగా మారింది. స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకొనేందుకు వేకువజాము నుంచి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ సాంప్రదాయాల ప్రకారం స్వామి వారికి నిత్య కైంకర్యాలను అర్చక స్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులను అనుమతించారు. స్వామి వారిని ఈరోజు సుమారు పన్నెండు వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ. 1,33,380, అన్నదాన విరాళాల ద్వారా రూ. 64,368, కేశ ఖండన ద్వారా రూ. 1800, తులాభారం ద్వారా రూ. 50, లడ్డు ప్రసాదం ద్వారా రూ. 15,990, స్వామి వారి కానుక ద్వారా రూ. 111, మొత్తం రూ. 2,15,699 ఆదాయం సమకూరినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం పులిహోర ప్రసాదం, సుమారు మూడు వేల ఐదు వందల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణచార్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## వరద ముంపు ప్రాంతంలో శుభం నోక్వల్ స్వచ్ఛ భారత్

**కూనవరం,పెన్ పవర్,ఆగస్టు 23.**స్వర్ణ ఆంధ్ర,స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆగస్ట్ నెల థీమ్ మూన్సన్ హైజానిక్ భాగంగా చింతూరు ఐటిడిఏ పిఓ శుభం నోక్వల్ మండల కేంద్రంలోని గోదావరి,శబరి వరద ముంపుకు ముగ్గురైన టేకులబోరు ఉదయ భాస్కర్ కాలనీ నందు పాల్గొన్నారు. వరద ముంపు గురియైన ఉదయ భాస్కర్ కాలనీ చుట్టూ ఉన్న పరిసరాలలో బ్లీచింగ్ పౌడర్ మరియు క్లీనింగ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా చూసుకోవాలని,నీటి నిల్వలో లార్వా ఉండడం వలన దోమల తీవ్రత ఉంటుందని తద్వారా మలేరియా,డెంగ్యూ టైఫాయిడ్ మొదలగు వ్యాధులు వ్యాపిస్తాయని అన్నారు.పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నట్లయితే వ్యాధులు వ్యాపించవని అన్నారు. మండలంలోని స్వచ్ఛభారత్ కార్యక్రమం మండల కేంద్రంలోను, చూచిదేవుల గూడెం, వెంకటాయపాలెం,పాలగుడెం గ్రామాలలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ హేమంత్ గాంధీ,వైస్ ఎంపీపీ బండారు సాంబశివరావు, ఎంపీడీవో జగన్నాధ రావు, డాక్టర్,టిడిపి మండల ప్రెసిడెంట్ బారపాటి ప్రకాష్,గండిపాటి ప్రసాద్,చెలికాని ఉమా,సత్యనారాయణ, దాసరి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



# దసలవారీగా యోగాభ్యాసం

- జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్







**అమలాపురం పెన్ పవర్ రూరల్ ఆగస్టు 23:** కోనసీమ జిల్లా లో విద్యార్థిని విద్యార్థులలో చదువు పట్ల ఆసక్తిని,క్రమశిక్షణ అలవాడేలా పైలెట్ ప్రాజెక్టుగా 8 సంక్షేమ వసతి గృహాలను శ్వాస మీద ధ్యాస వచ్చేటట్లు పాఠశాల ప్రారంభానికి ముందు 10 నిమి షాలు ముగింపుకు పది నిమి షాలు ముందు విపశ్యన యోగాభ్యసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ వెల్లడించారు. శనివారం స్థానిక మండల పరిధిలోని సమనస మహాత్మ జ్యోతిరావు పూలే ఆంధ్ర ప్రదేశ్ బీసీ వెల్ఫేర్ బాలుర రెసిడె న్షియల్ స్కూల్ను సందర్శించి విద్యార్థులతో తరగతి గది నందు ముచ్చటిస్తూ విపశ్యన యోగ సాధన పట్ల పొందు తున్న ఆసక్తిని క్రమ శిక్షణను గూర్చి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపశ్యన ధ్యాన బోధన జిల్లాలో 8 ఆశ్రమ పాఠశాలలో మూడు నెలల పాటు నిర్వహించి సత్ఫలితాలను ఇస్తే తదుపరి అన్ని పాఠశాలలో దశలవారీగా యోగా భ్యాసన ప్రక్రియను,నిర్వహిస్తామన్నారు.విపశ్యన యోగాభ్యాసన భారతదే శపు పురాతన ధ్యాన పద్ధతులలో ఒకటని. వేల సంవత్సరాల క్రితం గౌతమ బుద్ధుడు కనుగొన్న ఒక ఆత్మ పరిశోధనా పద్ధతని. ఈ పద్ధతి మనసు మరియు శరీరం మధ్య ఉన్న లోతైన సంబంధాన్ని నేరుగా అనుభవించడం ద్వారా స్వీయ- పరిశోధన చేసి మన జీవితంలో ఏర్పడే సమస్యలకు మూల కారణాలను గుర్తించి వాటిని తొలగించడానికి సహాయపడు తుందన్నారు.విపశ్యన ధ్యాన పద్ధతిలో, సాధకులు తమ శ్వాస ధ్యాస పై పూర్తి శ్రద్ధ పెడతారనీ శ్వాసను గమనించడం ద్వారా మనసును ఏకాగ్రత చేయడం మొదటి దశ, తరువాత,శరీరం పై కలిగే వివిధ సూక్ష్మమైన సంచనాలను నిష్పక్షపాతంగా గమని స్తారన్నారు. ఇలా నిరంతరం గమనించడం వల్ల, మన మనసులో ఉండే అశాంతి, కోపం, దుఃఖం వంటి ప్రతికూల భావనలన్నీ క్రమంగా తగ్గుతాయనీ,విపశ్యన ధ్యానం యొక్క ప్రయోజనాలు విపశ్యన ధ్యానం క్రమం తప్పకుండా సాధన చేయడం వల్ల అనేక ప్రయోజ నాలు ఉన్నాయన్నారు.మనసులో ఉండే ఒత్తిడి, ఆందోళన, కోపం వంటివి తగ్గి ప్రశాంతత పెరుగుతుందన్నారు.మనసు పని చేసే విధానం, ఆలోచనల మూలాలు మన ప్రవర్తనపై వాటి ప్రభావం గురించి లోతైన అవగాహన లభి స్తుందన్నారు నిరంతర సాధన వల్ల ఏకాగ్రత శ్రద్ధ గణనీయంగా మెరుగుప డతాయన్నారు.ప్రతికూల భావనల నుండి విముక్తి భయం,ఈర్ష్య, ద్వేషం వంటి ప్రతికూల భావనలు క్షీణించి, మనసు మరింత స్వేచ్ఛగా మారుతుందని. ఇది వ్యక్తిగత అనుభవం ద్వారా మాత్రమే పూర్తిగా అర్థం చేసుకోవడానికి వీలైన లోతైన పద్ధతి అన్నారు. ఈ విపశ్యన యోగ సాధన వల్ల విద్యార్థులలో క్రమేపి విద్య పట్ల ఆసక్తి క్రమశిక్షణ మెరుగుపడి కొంత మేర ప్రయోజనం చేకూరుతోందని విద్యార్థులు అభి ప్రాయాలు వ్యక్త చేశారన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం భాష, సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి .మమ్మీ విపశ్యన యోగా నిపుణులు అమర్, తాసిల్దారు అశోక్ ప్రసాద్ పాఠశాల అధ్యా పక సిబ్బంది పాల్గొన్నారు.

## ముద్రగడను కలిసిన చిన్నమిల్లి వెంకట్రాయుడు





**కిర్లంపూడి, పెన్ పవర్, ఆగస్టు 23:**మాజీ మంత్రి, రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజర్ కమిటీ సభ్యులు ముద్రగడ పద్మనాభంను భీమవరం నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చిన్నమిల్లి వెంకట్రాయుడు కలిశారు.ఈ సందర్భంగా ముద్రగడ తనయుడు ముద్రగడ గిరిబాబును చిన్నమిల్లి వెంకట్రాయుడు, పిఠాపురం, ప్రత్తిపాడు నియోజకవర్గాల వైసీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు కలిసి ముద్రగడ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా భీమవరం వైసీపీ ఇంచార్జి చిన్నమిల్లి వెంకట్రాయుడు మాట్లాడుతూ ముద్రగడ పద్మనాభం త్వరగా కోలుకుని ప్రజాక్షేత్రంలో ప్రజలకు సేవలు అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ముద్రగడ పద్మనాభం నీతి నిజాయితీ గల నాయకుడు అని రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా ఎంతోమంది ఆయన ఆరోగ్యం మెరుగుపడాలని పూజలు చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

# నవ ప్రపంచాన్ని నిర్మించే శక్తి యువతకే - ఏపీ నిట్ రిజిస్ట్రార్





**తాడేపల్లిగూడెం , పెన్ పవర్ ఆగస్టు 23 :**
"నవ ప్రపంచాన్ని సృష్టించే శక్తి యువతకే సొంతం" అని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి. దినేష్ శంకర్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఫోర్జ్ అలుమినస్ ఆధ్వర్యంలో, ఏపీ నిట్ – శశి ఇంజినీరింగ్ కళాశాల భాగస్వామ్యంతో జరుగుతున్న ఫోర్జ్ ఇన్స్పైర్ ఏ కెరీర్ అండ్ కార్పొరేట్ ఫెస్ట్ రెండో రోజు ఘనంగా కొనసాగింది.
ఈ సందర్భంగా డాక్టర్ దినేష్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ –
విద్యార్థుల ఆలోచనల్లో వైవిధ్యం ఉండాలి.
నైపుణ్యం –సాంకేతికత కలిస్తే అద్భుతాలు సృష్టించవచ్చు.
కృత్రిమ మేధ, మిషన్ లెర్నింగ్‌పై పట్టు సాధిస్తే ఉన్నత స్థానాలు అందుబాటులోకి వస్తాయి.
డాక్టర్ వీరేశ్ కుమార్ (డీన్, స్టూడెంట్స్ కెరీర్, అలుమ్ని అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్) మాట్లాడుతూ – విద్యార్థులు కలలు కని వాటిని సాకారం చేసుకునే కృషి చేయాలని సూచించారు.
శశి ఇంజినీరింగ్ కళాశాల ఉపాధ్యక్షుడు నరేంద్ర కృష్ణ – పుస్తక పరిజ్ఞానంతో పాటు సాఫ్ట్ స్కిల్స్, కోడింగ్, సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి పెట్టాలని విద్యార్థులను కోరారు.

మెర్సిడెస్ బెంజ్ కంపెనీ సీనియర్ ఇంజినీర్ అయ్యర్ భట్టాచార్య, టి–హబ్ డైరెక్టర్ అవినాష్ కేదార్, ఫ్యూజీ టెక్ ఉపాధ్యక్షుడు చాణిక్య వేలాది, ఫోర్జ్ అలుమినస్ ప్రతినిధి రేణికుంట్ల విజయ్ కుమార్ – స్టార్టప్ ఏర్పాటు కావాలంటే సృజనాత్మకతే ప్రధాన మంత్రం అని వివరించారు.
ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ అసోసియేట్ డీన్ డాక్టర్ పి. శంకర్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది.
తెలుగు రాష్ట్రాల నుంచి వెయ్యి మందికిపైగా విద్యార్థులు హాజరై ప్యానల్ డిస్కషన్, కోడథాన్, రోబోటిక్స్, జనరేటివ్ ఏఐ, ఐఓటి, గేమ్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్‌లులో పాల్గొని తమ ప్రతిభను చాటారు. రాత్రి జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి.

మావియాన్ కంపెనీ (రాజమండ్రి) నిర్వహించిన డ్రోన్ ఎక్స్‌పో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 16,000 ఏం ఏ హెచ్ సామర్థ్యం గల ఈ డ్రోన్ ద్వారా రైతులు 10 లీటర్ల పురుగుమందును పిచికారీ చేయవచ్చు. సమయాన్ని, శ్రమను ఆదా చేసే ఈ సాంకేతికత రైతులకు మరింత తోడ్పడనుంది.
అదేవిధంగా శశి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు పోర్టబుల్ లిథియం అయాన్ బ్యాటరీ ప్రాజెక్టును ప్రదర్శించారు. ఇది సోలార్ లేదా గ్రిడ్ ద్వారా ఛార్జ్ చేయగలదు. తక్కువ బరువుతో ఉండే ఈ బ్యాటరీని ప్రచార కార్యక్రమాలు, విపత్తుల సమయంలో ఉపయోగించవచ్చని వివరించారు.









# తాగునీటి జలాలు కలుషితం.. వాల్ ఛాంబర్స్ అధ్వానం

**–శుభ్రత నీరు గారుతోంది**

**జిల్లాలో పలు మండలాల్లోని గ్రామాల్లో రక్షిత నీటి పథకాలు శుభ్రం చేసేలా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవడం లేదని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు నీటిపారుదల శాఖ సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి పరిశుభ్రమైన తాగునీరు ప్రజలకు అందించకపోవడంతో కుళాయిల నుంచి వచ్చిన కలుషిత నీరు తాగి పలు గ్రామాల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు పంచాయతీలలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఎఫ్ టి కే ల ద్వారా నీటిని రెగ్యులర్గా పరీక్షలు చేయాలి జిల్లా వ్యాప్తంగా సగానికి పైగా పంచాయతీలలో అలాంటి పరీక్షలు నిర్వహించడం లేదు**





**ఏలూరు ఆగస్టు 23 పెన్ పవర్:** ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గం దెందులూరు మండలంలో దోసపాడు,కొవ్వలి పోతునూరు, గోపన్నపాలెం, సానిగూడెం, గ్రామాల్లోని రక్షిత నీటి పథకాల ద్వారా క్లోరినేషన్ చేసిన నీటిని సరఫరా చేయడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. రక్షిత నీటిని సరఫరా చేసే ఓ హెచ్ ఆర్ ట్యాంకుల వద్ద నీటి సరఫరా చేసే వాల్స్ ఛాంబర్లలో నీరు నిల్వ ఉండి అపరిశుద్ధత తో ఉన్నా సంబంధిత పంచాయతీ అధికారుల పర్యవేక్షణ లేక, కలుషితమైన నీరు కొళాయిల ద్వారా వస్తోందని, తాగునీటిలో మలినాలు మురుగునీరు వస్తుందని,నీటి నుండి దుర్వాసన వెలువడితోందని, మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ట్యాంక్ వాచరులు ట్యాంకుల చాంబర్లను శుభ్రపరిచేలా కార్యదర్శుల పరిరక్షణ లేకపోవడంతో కలుషిత నీటిని తాగి రోగాల బారిన పడుతున్నామని వ్యాఖ్యానిస్తున్నారు.డి డబ్ల్యూ ఎస్ చెరువులలో క్లోరినేషన్ చేసిన తరువాతే ఓ హెచ్ ఆర్ లకు నీటిని తోడాలని జల వనరుల శాఖ అధికారులు చెబుతున్నారు.అయినా గ్రామపంచాయతీలు ఆ ప్రక్రియను పాటించడం లేదు. దీనివలన ఓ హెచ్ ఆర్ లు కలుషిత నీటితో నిండుతున్నాయి. నిబంధనల ప్రకారం ప్రతి 15 రోజులకు ఒకసారి ఓహెచ్ఆర్లను శుభ్రం చేయాలి.శుభ్రం చేసిన తేదీ, తదుపరి పరిశుభ్రం చేయాల్సిన తేదీ, తదితర వివరాలను ట్యాంకుల వద్ద బోర్డులపై నమోదు చేయాల్సి ఉంది, ఎక్కడా శుభ్రం చేసిన ఆడవాళ్లు లేవు. ట్యాంకుల వద్ద బోర్డులు అలంకారప్రాయంగానే ఉన్నాయి. ఏ విధమైన వివరాలు నమోదు చేయడం లేదు గ్రామాల పర్యటనకు వెళ్ళినప్పుడు ఇటువంటి విషయాలు విస్తరణ అధికారులు పరిశీలించడం లేదని, టూర్ డైరీలో గ్రామాలను గ్రామాల ను సందర్శించినట్లు పేర్కొంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# వర్షాలు వరదలకు 4257 మంది నిరాశ్రయులు

**జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్**





**అమలాపురం.పెన్ పవర్ జూలై 23:** ఇటీవల కురిసిన భారీ వర్షాలు,గోదావరి వరదలు మూలంగా జిల్లాలో 1,291 కుటుంబాలు వారు ముంపు బారిన పడడంతో 4,257 మంది ముంపుకు బారినపడి నిరాశ్రయులు అయ్యారని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ శనివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు.వరద ఉధృతి తగ్గుముఖం పట్టినట్లు వెల్లడించారు.ఇప్పటివరకు మూడు కుటుంబాలలో పది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని,7 పునరా వాస కేంద్రాలు సిద్ధం చేశామని, 1,098 గృహాలు ముంపు బారిన పడ్డాయని ముంపు బాధితుల తరలింపుకు 23 బోట్లు సిద్ధం చేశామని, 282 మందికి సహాయక చర్యలు చేపట్టామని శనివారం 400 ఆహార ప్యాకెట్లను, 20 లీటర్ల సురక్షిత త్రాగునీటిని 810 టిన్నులు సరఫరా చేయడం జరిగిందన్నారు. కేవలం అమలాపురం డివిజన్లోనే బోడసకుర్రు పల్లిపాలెం,లంక ఆఫ్ ఠానేలంక, పాసర్లపూడి పాసర్లపూడి లంక, చింత పల్లి లంక కూనలంక గురజా పులంక లక్ష్మీదేవి లంక, గోడి లంక కొండుకుదురు గ్రామాలు ముంపు వారిని పడ్డాయన్నారు.వరద ఉధృతి తగ్గుముఖం పట్టడం జరిగిందని,ముంపు తగ్గేందుకు అవకాశాలు ఉన్నట్లు ఆయన ఆ ప్రకటనలో వెల్లడించారు .








# పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి భరోసా

- మున్సిపల్ కార్మికుల కోసం ప్రమాద, ఆరోగ్య బీమా స్కీంను ప్రారంభించిన ముఖ్యమంత్రి
- 55,686 మందికి మేలు కలిగేలా ఏక్సిస్ బ్యాంక్ శాలరీ అకౌంట్లు
- తక్కువ ప్రీమియంతో ఆరోగ్య బీమా










**పెద్దాపురం, పెన్ పవర్, ఆగస్టు 23** : స్వర్ణాంధ్ర –స్వచ్ఛాంధ్ర కార్యక్రమం అమలులో భాగంగా శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెద్దాపురం పట్టణంలో పర్యటించారు. తొలుత పెద్దాపురం – సామర్లకోట రహదారిలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద కాకినాడ జిల్లా ఇంచార్జ్ మంత్రి, పురపాలక శాఖా మంత్రి పి. నారాయణ, కార్మిక శాఖా మంత్రి వి. సుభాష్, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు, కాకినాడ లోక్‌సభ ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ జిల్లా స్పెషల్ ఆఫీసర్ జి. వీరపాండ్యన్, జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ జి. బిందుమాధవ్, తుని ఎమ్మెల్యేయనమల దివ్య, ముమ్మిడివరం ఎమ్మెల్యే డి.సుబ్బరాజు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, కర్రి పద్మశ్రీ, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), ప్రత్తిపాడు ఎమ్మెల్యే వి. సత్య ప్రభ, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, అనపర్తి ఎమ్మెల్యే ఎన్. రామకృష్ణారెడ్డి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ టి. సుధీర్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ జడ్పీ చైర్మన్ జ్యోతుల నవీన్ కుమార్, పెద్దాపురం మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, తదితరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం రంగరాయ మెడికల్ కళాశాల విద్యార్థులు, ప్రజా ప్రతినిధులతో కలిసి స్వచ్ఛతా ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం పట్టణ పరిధిలోని స్థానిక పదవ వార్డులో నిర్మించిన మ్యాజిక్ డ్రెయిన్లను సీఎం పరిశీలించి వాటి నిర్మాణం, ఉపయోగం గురించి మున్సిపల్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వీటి ద్వారా భూగర్భ జలాల పెరుగుదలతో పాటు పారిశుద్ధ్య నిర్వహణ భారం కూడా తగ్గుతుందని వివరించారు. ఇదిలా ఉండగా ప్రజలతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు చూసేందుకు చిన్నారులు భారీగా అక్కడికి చేరుకున్నారు. అది గమనించిన సీఎం వారి దగ్గరకు వెళ్లి వారితో కాసేపు సరదాగా మాట్లాడి కబుర్లు చెప్పారు. వారిలో స్ఫూర్తి నింపేందుకు ఆయన అందరితో కలిసి ఒక సెల్ఫీ కూడా దిగారు. అంతే కాకుండా ఆటోగ్రాఫ్ అడిగిన ఒక బాలుడి చొక్కాపై సీఎం నవ్వుతూ సంతకం చేశారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం కోసం ప్రమాద, ఆరోగ్య బీమా పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. పట్టణాభివృద్ధి శాఖ – ఏక్సిస్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పథకం అమలు చేసేలా ఒప్పందం కుదిరింది. ఈ మేరకు ఇప్పటికే మున్సిపల్ కార్మికుల శాలరీ ప్యాకేజ్ ఖాతాలు ప్రారంభించారు. ఈ కొత్త ఆర్థిక సదుపాయం ద్వారా మున్సిపల్ కార్మికులకు గణనీయమైన భరోసా లభించనుంది. ప్రస్తుతం రాష్ట్రంలోని 123 అర్బన్ లోకల్ బాడీస్ లో మొత్తం 55,686 మంది కార్మికులు సేవలందిస్తున్నారు. ఇప్పుడు ఈ పథకం ద్వారా వీరందరికీ భీమా సదుపాయం లభించనుంది. వీరిలో 39,170 మంది పబ్లిక్ హెల్త్ విభాగంలో ఉండగా, 16,516 మంది ఇతర విభాగాల్లో పనిచేస్తున్నారు. వీరిలో శాశ్వత, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానంలో పని చేస్తున్న వారందరికీ ఈ పథకం వర్తించనుంది. ఇంతవరకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మరణించిన సందర్భాల్లో కుటుంబీకులకు ఎక్స్–గ్రేషియా రూపంలో ప్రభుత్వం సహాయం అందిస్తోంది. ప్రమాద మరణానికి రూ.5 లక్షలు, సహజ మరణానికి రూ. 2 లక్షలు ఇచ్చే విధానం అమలులో ఉంది. ఇప్పుడు ఏక్సిస్ బ్యాంక్‌తో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం ద్వారా ఈ ప్రయోజనాలు మరింత విస్తరించాయి. శాశ్వత ఉద్యోగులకు ఒక రూ. 1 కోటి వరకు ప్రమాద భీమా, పది లక్షల లైఫ్ కవర్ లభించనుంది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఇరవై లక్షల ప్రమాద బీమా, రెండు లక్షల లైఫ్ కవర్ సదుపాయం ఉంటుంది. అంతేకాకుండా ప్రమాద మరణం జరిగితే పిల్లల చదువు కోసం గరిష్టంగా రూ. 8 లక్షల వరకు విద్యా సహాయం అందించనుంది. దీంతో పాటు తక్కువ ప్రీమియం ద్వారా ఆరోగ్య బీమా అందుబాటులో ఉంది. కుటుంబ సభ్యులతో కలిపి మొత్తంగా రూ. 33 లక్షల వరకు ఆరోగ్య బీమా వర్తిస్తుంది. ఇదే కాకుండా మున్సిపల్ కార్మికుల కుటుంబ సభ్యులు మరో జీరో బ్యాలెన్స్ అకౌంట్ తెరిస్తే వారికి రూ. 15 లక్షల మేర ప్రమాద భీమా కూడా అందుబాటులోకి వస్తుంది. ఈ పథకం తమకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని మున్సిపల్ కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



## ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరుకు సీఎం చంద్రబాబుకి మంత్రి లోకేష్ కి కృతజ్ఞతలు




పెన్ పవర్ ఆగస్టు 23 :అమలాపురానికి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కి విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కి కృతజ్ఞతలు చెబుతూ స్థానిక గడియారస్తంభం సెంటర్లో ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో విద్యార్థులు కూటమి నాయకులు థాంక్యూ సీఎం సార్ థాంక్యూ లోకేష్ సార్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిసి ఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు,రాష్ట్ర వాణిజ్య విభాగం కర్రి రామస్వామి, చింతా శంకరమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమతి అధికారి జయవెంకటలక్ష్మిబాబ్జి, పాలమూరి ధర్మపాల్, వలవల శివరావు, బొర్రా వెంకటేశ్వరరావు, వలవల పచ్చిమాల ఏడుకొండలు,నల్లా సుబ్బారావు, అవుపాటి గోపాల్, అమలాపురం పట్టణ టిడిపి అధ్యక్షులు తిక్కిరెడ్డి నేతాజీ, జనసేన నాయకులు ఏడిద శ్రీను, ఆర్డీఎస్ ప్రసాద్, మంతెన సురేష్ రాజు,నల్ల మల్లిబాబు, గేల్లా మీనా కుమారి, పేరూరి విజయలక్ష్మి, కూటమి నాయకులు కార్యకర్తలు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## కోడిపందాలు పేకాట ఆడితే తాటతీస్తా..

**- ఎటపాక ఎస్సై జి.అప్పలరాజు హెచ్చరిక**



**ఎటపాక ,పెన్ పవర్ ,ఆగస్టు 23** : రానున్న పండగల దృష్ట్యా మండల వ్యాప్తంగా ఎక్కడైనా కోడిపందేలు నిర్వహించిన , పేకాట ఆడినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఎస్సై జి.అప్పలరాజు హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కోడిపందేలు , పేకాట నిర్వహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జూద క్రీడలు కాకుండా సాంప్రదాయ ఆటలు ఆడుకోవాలని ఎస్సై సూచించారు. కోడీ పందేలు , పేకాట ఇలా ఏ జూద వ్యసనమైనా ప్రజల జీవితాలను నాశనం చేస్తుందన్నారు. అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొనే వారిని ఎట్టి పరిస్థితులలో ఉపేక్షించబోమన్నారు. కోడి పందేల జూదరులు , పేకాట నిర్వహకులపై ఇప్పటికే నిఘా పెట్టినట్లు చెప్పారు. కోడి పందేలు , జూదాల వల్ల ప్రజలు సులభంగా డబ్బులు సంపాదించాలని ఆశ పడి పందేలు కాసి డబ్బును నష్టపోతున్నారన్నారు. దీనివలన కుటుంబం ఇబ్బంది పడే అవకాశం ఉందన్నారు. కొందరు యువకులు జూదాలకు బానిసలై కేసుల్లో ఇరుక్కుపోయి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నట్లు చెప్పారు. యువత ఇటువంటి కేసులలో ఉంటే వారి యొక్క భవిష్యత్తు అంధకారం అవుతుందని, ఇతర దేశాలలో ఉద్యోగాల కొరకు వెళ్లే వారికి, ప్రభుత్వ ఉద్యోగాలు పొందే సమయంలో, పాస్ పోర్టు పొందే సమయాలలో ఈ కేసులు అడ్డంకిగా మారి యువత యొక్క జీవితాలు అధోగతి పాలవుతాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మండలంలో ఎక్కడైనా కోడిపందేలు నిర్వహించిన , పేకాట ఆడినా పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని , వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్సై జి.అప్పలరాజు కోరారు.

# అన్ని గ్రామ పంచాయతీల లో పరిశుభ్రత కార్యక్రమాలు





- జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్

**అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 23:** స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామ పంచాయతీలలో పరిశుభ్రత కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమాలు నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు. శనివారం స్థానిక మండల పరిధిలోని కామనగరువు పేరూరు చింతాడ గరువు రోళ్లపాలెంలలో జిల్లా కలెక్టర్ స్థానిక శాసనసభ్యులు డిఆర్ఓలు స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను పరిశీలించారు. తొలుత పేరూరు గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల వెనుక భాగాన సందర్శించి ఇటీవల జిల్లా కేంద్రానికి మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు. ప్రస్తుతం ఉన్నత పాఠశాల లో కొన్ని తరగతి గదులు ఖాళీగా ఉండడానికి గమనించి తొలుతగా డిగ్రీ కళాశాలను ఆ యొక్క రూములలో ప్రారంభించి దశలవారీగా భవన నిర్మాణానికి చర్యలు గైకొనడం జరుగుతుందని, అయితాబత్తుల ఆనందరావు జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ ఒక అభిప్రాయానికి వచ్చారు. తదుపరి చిందాడ గరువు రోల్లపాలెం శ్రీ స్వర్ణ దుర్గ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నందు ఎరువులు విక్రయాన్ని స్థానిక రైతులు ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ డిఆర్ఓ మాధవి లుతనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలు ఈపాస్ మిషన్ సక్రమంగా పనిచేయక పోవడంతో ఎరువుల నిల్వల్లో వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించారు త్వరగా మిషన్ రిపేర్ చేయించి వాడుకలోకి తెచ్చి నిల్వలను కచ్చితంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. కామన్గరువు నందు వస్తు మార్పిడి విధా నంలో ప్లాస్టిక్ కు బదులు నిత్యావసరాలు సరఫరా చేసేలా ప్రవేశపెట్టిన స్వర్ణ రథాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు స్వర్ణాంధ్ర స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్య క్రమంలో ఆగస్టు నెలకు ఇతివృత్తం వర్షా కాలంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంగా నిర్ణయించడం జరిగిందని, వర్షాకాలంలో వరదలు, నీటి నిల్వలు నివారించడం, మరియు అంటువ్యాధుల వ్యాప్తిని అరికట్టడం దీని ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఇందులో భాగంగా మురుగునీటి కాలువలను శుభ్రపరచడం, నీటి నిల్వల నివారణ, వంటి పనులు స్వచ్ఛం - పల్లె ప్రగతి" అనే నినాదంతో నిర్వహించారన్నారు గ్రామాలను చెత్త రహితంగా చేయడం. పారిశుధ్య మెరు గుదల. ప్రజలలో స్వచ్ఛత పట్ల అవగాహన పెంచడం,మంచి నీటి నిర్వహణ,పల్లె పచ్చదనం,ప్రజల భాగ స్వామ్యం ద్వారా గ్రామాలను మరింత పరిశు భ్రంగా,పచ్చగా మార్చడానికి అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. శాసనసభ్యులు ఆనందరావు మాట్లాడుతూ స్వచ్ఛతపై అవగాహనా ర్యాలీలు, పరిశుభ్రతా శ్రమదానం,మొక్కలు నాటడం వంటివి,నిర్వహించామన్నారు. ఈ–వ్యర్థాలను సేకరించి శాస్త్రీయ పద్ధతుల్లో తొలగించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు వినియోగించే ప్రతిఒక్కరూ రెడ్యూస్, రీయూజ్, రీ సైకిల్ అనే మూడు విషయాలను గుర్తుంచుకోవాలన్నారు .మారుతున్న కాలానికి అనుగుణంగా వాతావరణంలో వచ్చే మార్పులను అధిగ మించేందుకు ప్రతీ పౌరుడు సామాజిక బాధ్యతగా మొక్కలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. డిఆర్ఓ మాధవి మాట్లాడుతూ స్వచ్ఛ్ ఆంధ్ర విజయ వంతంలో ప్రజలు భాగస్వామ్యం అత్యంత కీలకమని, పచ్చదనం పరి ఢవిల్లితేనే మానవాళి మనుగడ సాధ్యమవుతుందన్న విషయాన్ని అందరూ గ్రహించాలన్నారు. ప్రకృతిని ప్రేమించడం, ప్రకృతితో కలిసి జీవించడం ద్వారానే మనిషి మనుగడ సరైన మార్గంలో ముందుకు సాగుతుందన్నారు, పర్యా వరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వాడకం నిషేధాన్ని గట్టిగా అమలు చేయకుంటే మన భావితరాల మనుగడ ప్రశ్నార్థకం అవుతుందన్నారు. ఈ కార్యక్ర మాలలో అమ్ముడా చైర్మన్ ఆల్లాడ స్వామి నాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు, డిపిఓ శాంత లక్ష్మి, తాసిల్దార్ అశోక్ ప్రసాద్ పిఎసిఎస్ చైర్మన్ ఎం మహాలక్ష్మి ప్రభాకర రావు, సర్పంచ్ నక్క రమణ కుమారి స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## భూసేకరణకు వ్యతిరేకంగా రైతులు వంట వార్పు 3 వ రోజు కొనసాగింపు



**పద్మనాభం. పెన్ పవర్, ఆగస్టు 23** :పద్మనాభం. మండలంలోని కృష్ణాపురం గ్రామ పరిధిలో ఉన్న సర్వే నంబర్ 88. 93 నెంబర్లలో ఉన్న డి ఫారం భూమి 66 ఎకరాలు భూమిని

రాష్ట్ర ప్రభుత్వం భూ సేకరణ పేరుతో రైతుల నుండి తీసుకోవడానికి ఏర్పాట్లు స్థానిక రెవె న్యూ అధికారులు చేస్తున్నారు. రైతుల నిర్వ హించిన వంట కార్యక్రమానికి శుక్రవారం ఆర్ఎ స్ఎన్ మూర్తి అప్పలనాయుడు. సూర్యనారా యణ పాల్గొని మాట్లాడారు. రైతుల సమస్య లపై అండగా నిలబడి రైతులకు భూ సమస్య పరిష్కారం అయ్యావు అంతవరకు సవరాలు కొనసాగిస్తామన్నారు అవసరమైతే తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని అన్నారు. రైతులు తెలుసుకొని బుధవారం నుండి వారు భూములు సిపిఎం పార్టీ ఆధ్వ ర్యంలో వంటా ఓర్పు కార్యక్రమాన్ని ఈ ఏర్పాటు చేశారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్కు భీమిలి రెవెన్యూ డివిజనల్ అధికారికి వ్రాతపూర్వకంగా రైతులు ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఎటువంటి గ్రామసభ లేకుండా రైతులు అనుమతి తీసుకో కుండా రెవెన్యూ అధికారులు బలవంతంగా భూసేకరణ పేరుతో యంత్రాలు పెట్టి సాగు చేయడంపై రైతులు మండిపడ్డారు దేనితో భీమిలి సిపిఎం కార్యదర్శి ఆర్ఎస్ అండ్ మూర్తి 78వ కార్పొరేటర్ గంగా రావు స్పందించి రైతు లకు మద్దతుగా నిలబడి జిల్లా అధికారులతో మాట్లాడారు రైతుల స్థలంలో వంట ఓర్పు కార్యక్రమాన్ని మూడు రోజులుగా కొనసాగించా రు సమస్య పరిష్కారం శిబిరాన్ని తీయమని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో రైతులు అప్పలరాజు నారా యణరావు అప్పలనాయుడు రాంబాబు ఎం.వలసయ్య ఎం పైడ్ అన. వై కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## కాఫీ, మిరియాలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం లభిస్తుంది

జాతీయ రహదారి విస్తరణలో రైతుల ఆందోళనకు స్పందించిన అధికారులు





**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఆగస్ట్ 23:**జాతీయ రహదారి విస్తరణ పనుల నేపథ్యంలో కాఫీ తోటలు, మిరియాల సాగు నష్టపోయిన రైతులకు తగిన నష్టపరిహారం అందజేస్తామని జీకే వీధి తహసిల్దార్ హెచ్. అన్నాజీ రావు హామీ ఇచ్చారు. పెదవలస పంచాయతీ కార్యాలయంలో నేషనల్ హైవే అథారిటీ అధికారులు, రెవెన్యూ శాఖ సిబ్బందితో కలిసి ఆయన రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, వంతెనల నిర్మాణం, రహదారి విస్తరణ పనుల సమయంలో తమ పంటలు తొలగించబడ్డాయని, కానీ నష్టపరిహారం ఇంకా అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన తహసిల్దార్ అన్నాజీ రావు, "నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నాం. అయితే రిజర్వ్ ఫారెస్ట్ భూముల్లో నష్టపోయిన పంటలకు పరిహారం వర్తించదు" అని స్పష్టం చేశారు. పెదవలస, చాపరాతిపాలెం, రంపులు గ్రామాల్లో పలు హెక్టార్లలో కాఫీ, మిరియాలు పంటలు నష్టపోయినట్లు అధికారులు గుర్తించారు. ఈ విషయాన్ని ఇప్పటికే సబ్ కలెక్టర్, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తహసిల్దార్ తెలిపారు. సమావేశంలో సర్పంచ్ కృష్ణవంశీ, వైస్ ఎంపీపీ సప్పగడ్డ ఆనంద్, పంచాయతీలో వివిధ పార్టీల నాయకులు, నేషనల్ హైవే అథారిటీ అధికారులు, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## 87వ వార్డ్ లో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం





**గాజువాక :పెన్ పవర్ ,ఆగస్టు 23**

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని 87వ వార్డులో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి స్థానిక వార్డు కార్పొరేటర్ బోండా జగన్నాధం అన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ విష జ్వరాలు వ్యాపించే దోమలు మంచినీటిలోనే పుడతాయని నీటి నిలువలు వండుకుండా మన పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని, సింగల్ యూస్ ప్లాస్టిక్ వినియోగం తగ్గించుకోవాలని,ప్రతీ ఒక్కరు తడి, పొడి చెత్తలను వేరుచేసి, ఇంటింటికి వచ్చి చెత్త సేకరించే వారికి అందించాలన్నారు. ఈ కార్యక్రమం లో వార్డ్ అధ్యక్షులు విజయరామరాజు, సెక్రటరీ బొట్టా ప్రకాష్, మాజీ హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ రాజన్ రాజు, సీనియర్ నాయకులు పావాడ రమణమూర్తి, ద్రోణాద్రి అప్పలనాయుడు,ఆనంద్ కుమార్,వెంకటర్రావు కడుపుట్ల శ్రీను, బొడ్డేటి దేముళ్ళు, శానిటరీ ఇన్స్పెక్టర్ అప్పారావు, మలేరియా డిపార్ట్మెంట్ సూపర్వైజర్ నరేష్, శానీటరీ సిబ్బంది, మలేరియా డిపార్ట్మెంట్ సిబ్బంది, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కాలబైరవుడికి పొలాల అమావాస్య సందర్భంగా మహాభిషేకం. క్షీరాభిషేకం





**గాజువాక: పెన్ పవర్, ఆగస్టు 23** జీవీఎంసీ 64వ వార్డు వాంబే కాలనీ శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో కాలభైరవ స్వామికి పొలాల అమావాస్య సందర్భంగా మహాభిషేకం క్షీరాభిషేకం ప్రత్యేక హెూమాలు పూజలు ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ దొడ్డి రమణ నేతృత్వంలో జరిపించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులు మాట్లాడుతూ ప్రతి శనివారం అన్నప్రసాదం ఆలయ కమిటీ వారిఆర్థిక సహాయంతో భారీ అన్న సమారాధన నిర్వహించారు . ముఖ్య అతిథులు మాట్లాడుతూ పొలాల అమావాస్య కాలభైరవుడికి అభిషేకం హెూమంలు చేయడం జరిగిందని దీనివల్ల మన పితృదేవులకు మన కుటుంబ సభ్యులకు సుఖ సంతోషాలు ఆయురారోగ్యాలు , కలుగుతాయని స్వామివారిని కొలిస్తే కోరిన కోరికలు తీరుతాయని దృఢ సంకల్పంతో స్వామిని పూజిచేసి స్వామివారి కృపకు పాత్రులు అవుతారని అన్నారు. గాజువాక ప్రాంతంలో కాల బైరవ దేవస్థానం నిర్మించడం ఎంతో శుభదాయకమని కొనియాడారు పరిసర ప్రాంత ప్రజలందరూ స్వామివారిని దర్శించుకుని వారి కోరిన కోరికలు తీర్చుకోవలసిందిగా ప్రజలను అభ్యర్థించారు. అశోక్ నగర్ వాస్తవ్యులు గంగరాజు హనుమాన్ చాలీసా సుందరాకాండ భక్తులకు ప్రవచనాలు వినిపించారు. ఈ కార్యక్రమంలో డి. నాగరాజు,ఉషారాణి, అరుణ, కాంతమ్మ, పైడితల్లి, స్వాతి, సావిత్రమ్మ, లక్ష్మమ్మ, చిన్నమ్మలు, జి.కుమారి,కె.భవాని, రూపా దేవి, జి. పద్మ, సత్యవతి, ఆడారి లక్ష్మి ఈ కార్యక్రమంలో మరియు ఆలయ కమిటీ సభ్యులు కాలనీ భక్తులందరూ పాల్గొన్నారు.

### భద్రగిరి సిహెచ్సీను ఆకస్మికంగా తనిఖీ చేసిన డిసిహెచ్ఎస్.



**గుమ్మలక్ష్మీపురంలో ఆగస్టు 23.పెన్ పవర్.** మండలంలో గల భద్రగిరి,సి హెచ్ సి ఎస్.ను జిల్లా ముఖ్య వైద్య ఆరోగ్య అధికారి నాగభూషణరావు శనివారం నాడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించి. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం నిర్మాణంలో ఉన్న కొత్త ఆసుపత్రి భవనాన్ని పరిశీలించి వివరాలను సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు రవి,షణ్ముఖి,హెచ్ ఎన్,మంగమ్మ,యుడిసి త్రినాథ, ఎస్,ఎస్ వెంకట రావు,ఉన్నారు.

## డ్రగ్స్ వద్దు బ్రో: సీలేరు జెన్కోలో ఈగల్ టీం అవగాహన కార్యక్రమం

**విద్యార్థులు, యువత డ్రగ్స్ బారిన పడకూడదు**

**ఇన్స్పెక్టర్ సూర్య మోహనరావు**

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఆగస్ట్ 23:**తూర్పుగోదావరి జిల్లా ఈగల్ టీం ఆధ్వర్యంలో శనివారం "డ్రగ్స్ వద్దు బ్రో" అనే స్లోగన్‌తో నిర్వహించిన డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం సీలేరు జెన్కో కళ్యాణ మండపంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఉద్యోగులు, స్థానిక అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈగల్ టీం ఇన్స్పెక్టర్ పీవీ సూర్య మోహనరావు మాట్లాడుతూ, "దేశాభివృద్ధిలో విద్యార్థుల పాత్ర కీలకం. అయితే కొంతమంది యువత, విద్యార్థులు డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాల బారిన పడుతూ తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు" అని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ ఉద్యోగుల్ని ఉద్దేశించి మాట్లాడుతూ, "మీరు పని చేస్తున్న ప్రాంతాల్లో గంజాయి విస్తరణ గురించి తెలుసుకుని, సమాజానికి కలిగే నష్టాన్ని అర్థం చేసుకోవాలి. గంజాయి, డ్రగ్స్ సంబంధిత సమాచారం టోల్‌ఫ్రీ నెంబర్ 1972 కు తెలియజేయడం మీ సామాజిక బాధ్యత" అని అన్నారు. ఈ సందర్భంగా ఎన్‌డీపీఎస్ చట్టాల ప్రాముఖ్యతను వివరించిన సూర్య మోహనరావు, డ్రగ్స్ కేసుల్లో చిక్కుకుంటే ఏవిధంగా వ్యక్తిగత జీవితం దెబ్బతింటుందో స్పష్టంగా వివరించారు. కార్యక్రమంలో సీఐ నారాయణరావు, ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, ఈఈ రాజేంద్రప్రసాద్, సీలేరు రేంజ్ అధికారి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



# జెలెన్ స్కీ-పుతిన్... నూనె-వెనిగర్.. కలపలేం: ట్రంప్




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రాణ స్నేహితులను పాలు-నీళ్లతో పోల్చుతాం... వీరిని ఎంతకూ విడదీయలేం. అలాగే ఇద్దరు బద్ద శత్రువులను ఉప్పు-నిప్పుతో పోల్చుతాం.. వీరిని అసలు కలపడం సాధ్యం కాదని అర్థం. ఇప్పుడు ఉక్రెయిన్-రష్యా అధ్యక్షులు జెలెన్ స్కీ-పుతిన్ లను ఇదే విధంగా అభివర్ణించారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. ఔను మరి.. ఆ రెండు దేశాల మధ్య మూడున్నరేళ్లుగా యుద్ధం సాగుతోంది. ఈ సమయంలో ప్రపంచమంతా ఎంతోకొంత మారింది...! కానీ, పుతిన్-జెలెన్ స్కీల మధ్య వైరం మాత్రం ఇంకా పెరిగిందే కానీ తగ్గలేదు.

**యుద్ధం ప్రారంభంలోనే..**

2022 ఫిబ్రవరిలో మొదలైంది రష్యా-ఉక్రెయిన్ యుద్ధం. పుతిన్-జెలెన్ స్కీ భేటీ అవుతారంటూ అప్పట్లోనే పెద్ద ఎత్తున కథనాలు వచ్చాయి. తటస్థ దేశం దీనికి వేదిక అవుతుందని భావించారు. కానీ, అలాంటిదేమీ లేదు. ఇప్పుడు ట్రంప్.. ఆ ఇద్దరు బద్ధ విరోధులను కలవడం అంటే సాధ్యం కాదనే అర్థం వచ్చేలా మాట్లాడారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య శాంతి ప్రయత్నాలపై రెండు వారాల్లో ముఖ్య నిర్ణయం తీసుకుంటామని, కానీ, పుతిన్-జెలెన్ స్కీ సమావేశం నూనె-వెనిగర్ లను కలపడం అంత కష్టమని వ్యాఖ్యానించారు.

**యుద్ధం ముగిస్తారా? మా ఫ్యాక్టరీపై దాడి చేస్తారా...?**

యుద్ధం ముగింపులో పుతిన్-జెలెన్ స్కీ కలిసి పనిచేస్తారా? అన్నది తనకు స్పష్టత లేదని... మున్ముందు వారి మధ్య సమావేశానికి తాను హాజరవుతానో లేదోనని ట్రంప్ పేర్కొన్నారు. కాగా, తాజాగా రష్యా డ్రోన్లతో పెద్దఎత్తున ఉక్రెయిన్ పై విరుచుకుపడింది. ఈ క్రమంలో అమెరికాకు చెందిన ఫ్యాక్టరీ దెబ్బతిన్నది. దీనిపై ట్రంప్ మండిపడ్డారు. ఇలాంటి చర్యలకు రష్యాపై భారీ ఆంక్షలు ఎదుర్కొనాల్సి ఉంటుందని హెచ్చరించారు. తాను యుద్ధం ముగించాలని చూస్తుంటే.. పుతిన్ మాత్రం భిన్నంగా వెళు _న్నారని అన్నారు.

**రెండు వారాల సమయంలో...**

మూడున్నరేళ్ల యుద్ధం ముగింపుపై పుతిన్-జెలెన్ స్కీ ఏమనుకుంటున్నారనేది స్పష్టత రావడానికి తనకు రెండు వారాలు పడుతుందని ట్రంప్ అన్నారు. వారిద్దరూ ఓ ఒప్పందం చేసుకోకుంటే తానే నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. అది భారీ ఆంక్షలా? సుంకాలా? ఒకవేళ రెండూ కావొచ్చన్నారు. కాగా, ట్రంప్.. ఇప్పటికే పుతిన్ తో అలస్కాలో సమావేశం అయ్యారు. యూరోప్ దేశాల అధినేతలతో కలిసి జెలెన్ స్కీతో కూడా భేటీ అయ్యారు. ఇక మిగిలింది పుతిన్-జెలెన్ స్కీలను కూర్చోబెట్టడమే. ఆ పని చేస్తున్నామని ప్రకటించారు. త్రైపాక్షిక సమావేశానికి తాము సిద్ధమేనని జెలెన్ స్కీ చెప్పారు.

# పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ క్షీణించడానికి కారణం అదేనా?



**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్తాన్ ఎప్పుడూ భారతదేశం మీద పగ సాధించాలని, భారతదేశాన్ని నాశనం చేయాలని ప్లాన్ వేయడం తప్ప ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుకునే ప్రయత్నాలు అయితే చేయడం లేదు. ఒకప్పుడు పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ భారతదేశం ఆర్థిక వ్యవస్థకు సరి సమానంగా ఉండేది.అలాంటి పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది.. మరి ఇంతకీ పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ రోజురోజుకీ క్షీణించడానికి కారణం ఏంటి..? ఎందుకు పాకిస్థాన్ ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటుంది?అనేది ఇప్పుడు తెలుసుకుందాం..పాకిస్తాన్ ఎప్పుడూ మతపరమైన తీవ్రవాదాన్ని రెచ్చగొడుతూ ఆర్థిక వ్యవస్థపై శ్రద్ధ పెట్టడం మానేసింది. మతపరమైన తీవ్రవాదం పెరగడం వల్ల పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ క్షీణిస్తోంది అని కొన్ని నివేదికల్లో తేలింది. అయితే ది ఎక్స్ప్రెస్ ట్రిబ్యూట్ నివేదిక 2023 జనాభా, గృహ గణన నుండి పొందిన డాటా ప్రకారం..పాకిస్థాన్లో దాదాపు 6 లక్షల మసీదులు,36వేల మతపరమైన సెమినరీలు ఉన్నాయి. ఇక 23 వేల కర్మాగారాలు మాత్రమే ఉన్నాయి అంటూ తెలియజేసింది.. ఇక ప్రణాళిక మంత్రి అహ్సాన్ ఇక్బాల్ విడుదల చేసిన 2023 జనాభా లెక్కల నివేదిక ప్రకారం చూస్తే.. పాకిస్థాన్లో 23 వేల కర్మాగారాలు, 6,04,300 చిన్న ఉత్పత్తి యూనిట్లు, 2,42,000 పాఠశాలలు, 11568 కాలేజీలు,214 యూనివర్సిటీలు,6,04,000 మసీదులు, 36,331 మదర్సాలు ఉన్నాయని తెలిపారు.

అయితే పాకిస్తాన్లో ఉన్న పాఠశాలలో ఎక్కువ భాగం ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్నవేనని, వీటిలో 11,568 కాలేజీలు ఉన్నాయని,వీటిలో ప్రైవేట్ రంగం వాటా కూడా కొంచెం ఎక్కువగానే ఉందని ఆర్థిక సర్వే వెల్లడించింది. ఇక ఈ నివేదిక ప్రకారం సింధు ప్రావిన్సులు, పంజాబ్, కరాచీ ప్రాంతం ఆర్థిక సంస్థలు, శ్రామిక శక్తి రెండిట్లోనూ అత్యధిక సాంద్రతను కలిగి ఉన్నాయి. ఆ తర్వాత స్థానాల్లో ఉన్న ఖైబర్ పఖ్తుంఖ్వా , బలచిస్తాన్ లు అశాంతితో కూడిన ప్రదేశాలు. పాకిస్తాన్ దేశం మొత్తంలో 29,836 ప్రభుత్వ కార్యాలయాలు,10,452 సెమీ గవర్నమెంట్ ఆఫీసులు, అలాగే 19,645 బ్యాంకులు ఉన్నాయి..

అయితే పాకిస్తాన్ ఆర్టిక వ్యవస్థ దెబ్బ తినడానికి కారణం అక్కడ ఉన్న వ్యాపారాలు చాలా వరకు చిన్న తరహావే. ఈ వ్యాపారాలు కొద్ది మందికి మాత్రమే ఉపాధిని కల్పిస్తున్నాయి. అలా పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ క్షీణించడానికి కారణం అక్కడి ప్రజలకు సరైన ఉపాధి లేకపోవడమే. ఎప్పుడు మతపరమైన కల్లోలాలు, ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం తప్ప ప్రజలకు సరైన ఉపాధి కల్పించలేకపోతుంది పాకిస్తాన్ గవర్నమెంట్. అందుకే పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ రోజు రోజుకి క్షీణిస్తోంది అని కొన్ని నివేదికలు తెలియజేస్తున్నాయి..

# పెద్దాపురంలో సీఎం చంద్రబాబు బహిరంగ సభ

## "ప్రపంచంలోనే గొప్ప నగరంగా అమరావతిని తీర్చిదిద్దుతాం"






పెద్దాపురం, కాకినాడ స్టాఫ్ రిపోర్టర్, పెన్‌పవర్, ఆగస్టు 23: కాకినాడ జిల్లా పెద్దాపురంలో నిర్వహించిన "స్వర్ణాంధ్ర%-%స్వచ్ఛాంధ్ర" కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఘాటుగా ప్రసంగించారు. రాష్ట్ర అభివృద్ధి, పేదరిక నిర్మూలన, ప్రజా సంక్షేమమే తన ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

**అభివృద్ధి - పరిశుభ్రతపై దృష్టి**

"స్వర్ణాంధ్ర కావాలంటే మన ఆలోచనా విధానం మారాలి" అని సీఎం పిలుపునిచ్చారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని గుర్తుచేశారు. గత వైసీపీ ప్రభుత్వం చెత్తపై పన్ను వేసి, కానీ చెత్త తొలగించలేదని విమర్శించారు. "అక్టోబర్ 2 నాటికి అన్ని మున్సిపాలిటీల్లో చెత్త నిర్మూలన కార్యక్రమాన్ని మొదలు పెడతాం. చెత్త నుంచి కూడా సంపద సృష్టించవచ్చు" అని వివరించారు.

**వైసీపీపై ఘాటు విమర్శలు**

చంద్రబాబు వైసీపీపై మండిపడ్డారు. "గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అస్తవ్యస్తం చేసింది. అరాచక పాలన కొనసాగింది. ప్రజా ఆరోగ్యాన్ని గాలికొట్టేసింది. తప్పుడు వార్తలు రాయించేందుకే పత్రిక పెట్టుకున్నారు. నేర చరిత్ర కలిగిన వారు రాజకీయాల్లోకి వచ్చారు" అని తీవ్రంగా విమర్శించారు. ప్రజలు అలాంటి వారిని దూరంగా ఉంచాలని పిలుపునిచ్చారు.

**సంక్షేమ-అభివృద్ధి కార్యక్రమాలు**

సీఎం మాట్లాడుతూ పలు హామీలు, భరోసాలు ఇచ్చారు: పెద్దాపురంలో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేస్తామని హామీ.రైతులకు అన్నదాత సుఖీభవ కింద డబ్బులు జమ అవుతున్నాయని తెలిపారు.

40 వేల హెయిర్ కటింగ్ సెలూన్లకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు.మహిళలకు ఉచిత బస్సు సదుపాయం, పుణ్యక్షేత్ర యాత్రలు సులభమవుతున్నాయని వివరించారు.సీ వీడ్‌తో ఆదాయం పెంచేందుకు చర్యలు, లక్షమంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే ప్రణాళికలు ఉన్నాయని చెప్పారు.పోలవరంను 2027 నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. అమరావతిని ప్రపంచంలోనే గొప్ప నగరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకున్నామని, విశాఖకు రైల్వే జోన్ వస్తోందని వివరించారు.

**బాబు వ్యాఖ్యలు - సభికుల్లో ఉత్సాహం**

"ఓటు వేయడంలో కూడా పది సార్లు ఆలోచించాలి. అప్పుడే రాష్ట్రం ముందుకు సాగుతుంది. వైకుంఠపాళీ ఆటలు వద్దు.. మనకు అభివృద్ధి కావాలి, పేదరికం పోవాలి" అంటూ చంద్రబాబు పిలుపునిచ్చారు. అమరావతి, విశాఖపట్నం, తిరుపతిని మహానగరాలుగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు.

**ప్రత్యేక ఆకర్షణ**

సభలో భాగంగా ప్రభుత్వ అధికారులు ఏర్పాటు చేసిన బుర్రకథ గానం కార్యక్రమం జనాన్ని ఆకట్టుకుంది. సభకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరై సీఎం ప్రసంగానికి చప్పట్లు కొట్టారు.





# ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు పేద విద్యార్థులకు వరం






**ఎమ్మెల్యే ఆనందరావుకు అభినందనలు**

**హర్షం వ్యక్తం చేసిన పి డి ఎస్ యు విద్యార్థి సంఘం**

అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 23 :డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముఖ్య కేంద్రం అమలాపురంనకు జిల్లా నలుమూలల నుండి ఉన్నత విద్య అభ్యసించడానికి జిల్లా కేంద్రానికి ఎంతో మంది నిరుపేద విద్యార్థులు వస్తున్న నేపథ్యంలో అమలాపురంలో స్వాతంత్రం వచ్చిన నాటి నుండి ఇప్పటివరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు ఈ నేపథ్యంలో గత 20 సంవత్సరాలుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పి డి ఎస్ యు సుదీర్ఘమైన పోరాటం నిర్వహించిందని అధికారులు ప్రజా ప్రతినిధులకు అనేక సార్లు విన్నవించి విద్యార్థులతో ఉద్యమం నిర్వహించిందని ఉద్యమ ఫలితంగా పేద విద్యార్థుల ఆకాంక్షలకు అనుగుణంగా అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు చేసిన కృషి. పట్టుదల వలన నేడు అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం హర్షణీయమని, పేద విద్యార్థులకు వరంగా మారిందని, ఆర్థికపరమైన ఇబ్బందుల వలన ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో వేలకు వేలు ఫీజులు కట్టలేక ఉన్నత విద్యకు దూరమవుతున్న నిరుపేద విద్యార్థుల్లో ఆనందం కలిగించిందని 75 సంవత్సరాల డిగ్రీ కళాశాల కల ఫలించిందని పి డి ఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు తెలిపారు.ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల మంజూరు చేయించిన ఎమ్మెల్యే ఆనందరావు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వారికి పి డి ఎస్ యు విద్యార్థి సంఘం జిల్లా కార్యవర్గం, అమలాపురం పరిసర ప్రాంత విద్యార్థులు. ప్రజలు. మేధావుల తరపున అభినందనలు తెలియజేశారు. జిల్లా ముఖ్య కేంద్రం అమలాపురంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల (కో ఎడ్యుకేషన్) పాలిటెక్నిక్ ఐటిఐ ఇంజనీరింగ్ కళాశాల లాంటి ప్రభుత్వ విద్యాసంస్థలు ఏర్పాటు చేసి పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడవలసిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ అమలాపురంలో ఏర్పడిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలను పేద విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని రేవు తిరుపతిరావు సూచించారు.



# బౌలింగ్ కోసం ఆ మూడింటినీ బుమ్రా వదిలేశాడు: భరత్ అరుణ్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంటర్నెట్ డెస్క్: జస్ప్రీత్ బుమ్రా పేరు చెప్పగానే మనకు అతడి యూనిక్ యాక్షన్, సర్రున దూసుకొచ్చే బంతులే గుర్తుకు వస్తాయి. అయితే దీని కోసం బుమ్రా ఎంతో కష్టపడ్డాడు. ఎన్నో త్యాగాలు చేశాడు. బౌలింగ్‌లో మరింత వేగం కోసం తనకిష్టమైన మూడు ఆహారాలనూ వదిలేశాడు. ఈ విషయాన్ని టీమ్‌ఇండియా మాజీ బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్ తెలిపాడు. అలాగే బుమ్రా బౌలింగ్ యాక్షన్ వల్ల అతడి శరీరం చాలా ఒత్తిడికి గురైంది. దీంతో అతడి కోసం ప్రత్యేక ప్లాన్‌ను సిద్ధం చేశానని అప్పటి రోజులను భరత్ గుర్తుకు తెచ్చుకున్నాడు. 'ఫిట్‌నెస్ అనగానే మనకు విరాట్ కోహ్లీ గుర్తుకు వస్తాడు. కానీ ఈ విషయంలో జస్ప్రీత్ బుమ్రా కూడా ఏం తక్కువ కాదు. 2013లో బుమ్రా అండర్-19 క్యాంప్‌లో భాగంగా సెలెక్షన్ కోసం ఎన్‌సీఏకు (%చీజూా%) వచ్చాడు. అతడు తుది జట్టులో లేడు. కానీ నేషనల్ క్రికెట్ అకాడమీ క్యాంప్‌నకు వచ్చిన 30 మంది సభ్యుల్లో ఉన్నాడు' అని భరత్ ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించాడు.

'అప్పట్లో బుమ్రా మరీ వేగంగా బంతులేయలేకపోయాడు. దీంతో మేం ఫిజియో, స్ట్రెంత్ అండ్ కండీషనింగ్ కోచ్‌తో మాట్లాడాం. మేమంతా అతడి యాక్షన్ జోలికి వెళ్లకూడదనుకున్నాం. ఎందుకంటే అది యూనిక్ యాక్షన్. దాంతో చాలా పేస్ జనరేట్ చేయొచ్చని మాకు అనిపించింది. కానీ అదే సమయంలో ఆ యాక్షన్ వల్ల అతడి శరీరం మీద తీవ్రమైన ఒత్తిడి పడుతుందని గుర్తించాం' అని భరత్ పేర్కొన్నాడు. ఆ సమయంలో బుమ్రాతో తాము మాట్లాడిన విషయాన్ని వెల్లడించాడు. 'మేం బుమ్రాను పిలిచి అతడితో మాట్లాడాం. ఫాస్ట్ బౌలర్‌గా రాణించాలంటే ఫిజికల్‌గా కూడా ఫిట్‌గా ఉండాలని అతడికి సూచించాం. డైట్, వ్యాయామం, చేయాల్సిన త్యాగాల గురించి వివరించాం. బుమ్రా కూడా వెంటనే తనను తాను మార్చుకున్నాడు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం ప్రారంభించాడు. జిమ్‌లో వర్క్ అవుట్లు మొదలు పెట్టాడు. అచ్చం విరాట్ కోహ్లీలానే ఫిట్‌నెస్ కోసం అంకితభావంతో కృషి చేశాడు. బుమ్రాకు బర్గర్లు, పిజ్జాలు, మిల్క్‌షేక్స్ అంటే చాలా ఇష్టం. కానీ వాటిని మరుక్షణమే వదిలేశాడు. రుచికరమైన ఆహారం కంటే.. తనకు బౌలింగే ఇష్టం అని చాటి చెప్పాడు' అని భరత్ అరుణ్ గుర్తుచేసుకున్నాడు.

టీమ్‌ఇండియా ఇటీవలే ఇంగ్లాండ్‌లో పర్యటించింది. అందులో భాగంగా అయిదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ఆడింది. అయితే వర్క్‌లోడ్ నేపథ్యంలో బుమ్రా ఈ సిరీస్‌లో కేవలం మూడు మ్యాచ్‌లే ఆడాడు. వీటిలో 14 వికెట్లు పడగొట్టాడు. సెప్టెంబర్ 9 నుంచి యూఏఈ వేదికగా ఆసియా కప్ జరగనుంది. ఈ నేపథ్యంలో ప్రకటించిన భారత జట్టులో కూడా బుమ్రా స్థానం సంపాదించాడు.

# ఆసియా కప్ కోసం బంగ్లాదేశ్ జట్టు ప్రకటన

## సెప్టెంబరు 9 నుంచి ఆసియా కప్ సమరం

## ఇప్పటికే జట్లను ప్రకటించిన భారత్, పాక్

## తాజాగా 16 మందితో బంగ్లాదేశ్ జట్టు ఎంపిక



**హైదరాబాద్ పెన్ పవర్:** మరికొన్ని రోజుల్లో ఆసియా క్రికెట్ సమరానికి తెరలేవనుంది. టీ20 ఫార్మాట్లో జరిగే ఈ క్రికెట్ యుద్ధం సెప్టెంబరు 9 నుంచి సెప్టెంబరు 28 వరకు యూఏఈలో నిర్వహించనున్నారు. ఇప్పటికే టీమిండియా, పాకిస్థాన్ ఆసియా కప్ టోర్నీ కోసం తమ జట్లను ప్రకటించాయి. తాజాగా బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు కూడా 16 మందితో జట్టును ప్రకటించింది. లిట్టన్ దాస్ కెప్టెన్సీలో అనుభవజ్ఞులు, యువకుల కలబోతగా జట్టు ఎంపిక జరిగింది. ఆసియా కప్ టోర్నీలో ఈసారి మొత్తం 8 జట్లు పాల్గొంటుండగా... వాటిని రెండు గ్రూపులు చేశారు. గ్రూప్-ఏ లో భారత్, పాకిస్థాన్, యూఏఈ, ఒమన్ జట్లు ఉన్నాయి. బంగ్లాదేశ్ జట్టు శ్రీలంక, ఆఫ్ఘనిస్థాన్, హాంకాంగ్ జట్లతో కలిసి గ్రూప్-బి లో ఉంది.

**బంగ్లాదేశ్ జట్టు**

లిట్టన్ దాస్ (కెప్టెన్), నురుల్ హసన్ (వికెట్ కీపర్), తాంజిద్ హుస్సేన్, పర్వేజ్ ఇమాన్, తౌహీద్ హృదయ్, సైఫ్ హసన్, జకీర్ అలీ (వికెట్ కీపర్), షమీమ్ హుస్సేన్, రిషాద్ హుస్సేన్, నసూమ్ అహ్మద్, ముస్తాఫిజూర్ రెహ్మాన్, తాంజిమ్ సకిబ్, మెహదీ హసన్, తస్కిన్ అహ్మద్, షోరిఫుల్ ఇస్లామ్, సైఫుద్దీన్.

# సచిన్ మాట విని తప్పు చేశా.. ఇప్పటికీ బాధపడతా: ద్రవిడ్



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ చరిత్రలో 'ది వాల్'గా పేరుగాంచిన రాహుల్ ద్రవిడ్, తన కెరీర్‌కు సంబంధించి ఒక ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నాడు. తాను చేసిన ఒకే ఒక పెద్ద తప్పు, మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ సలహాను పాటించడమేనని, ఆ నిర్ణయం పట్ల ఇప్పటికీ విచారం ఉందని తెలిపాడు. మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌తో జరిగిన ఒక ఇంటర్వ్యూలో ద్రవిడ్ ఈ చేదు జ్ఞాపకాన్ని గుర్తుచేసుకున్నాడు.

**అసలేం జరిగిందంటే..?**

2011లో భారత జట్టు ఇంగ్లండ్‌లో పర్యటించింది. ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగిన టెస్టు మ్యాచ్‌లో ఇంగ్లండ్ బౌలర్ జేమ్స్ అండర్సన్ బౌలింగ్‌లో ద్రవిడ్ బ్యాటింగ్ చేస్తున్నాడు. ఒక బంతికి అంపైర్ సైమన్ టఫెల్ అతడిని క్యాచ్ ఔట్‌గా ప్రకటించారు. అయితే, బంతి తన బ్యాట్‌కు తగిలినట్లు తనకు అనిపించలేదని ద్రవిడ్ తెలిపాడు. "నేను బంతిని డ్రైవ్ చేసినప్పుడు 'టక్' అని ఒక శబ్దం వచ్చింది. కానీ నా బ్యాట్‌కు బంతి తగిలిన ఫీలింగ్ అస్సలు లేదు. కొన్నిసార్లు బ్యాట్స్‌మెన్‌కు ఆ విషయం స్పష్టంగా తెలుస్తుంది" అని ద్రవిడ్ వివరించాడు.

అంపైర్ నిర్ణయంపై సందేహంతో నాన్-స్ట్రైకర్ ఎండ్‌లో ఉన్న సచిన్ వద్దకు వెళ్లి చర్చించాడు. "బంతి నా బ్యాట్‌కు తగలలేదని నేను సచిన్‌తో చెప్పాను. కానీ సచిన్, 'రాహుల్, చాలా పెద్ద శబ్దం వచ్చింది యార్. కచ్చితంగా నువ్వు దాన్ని బాదేశావ్' అని అన్నాడు. అతను అలా చెప్పడంతో బహుశా నాకే పొరపాటుగా అనిపించిందేమో అనుకుని రివ్యూ తీసుకోకుండా పెవిలియన్ వైపు నడిచాను" అని ద్రవిడ్ ఆనాటి సంభాషణను గుర్తుచేసుకున్నాడు.

**రీప్లేలో తేలిన నిజం**

డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లి రీప్లే చూశాక ద్రవిడ్‌కు అసలు విషయం తెలిసింది. బంతి బ్యాట్‌కు కొద్ది దూరంలో వెళ్లిందని, బ్యాట్ అతని షూలేస్‌కు తగలడం వల్ల ఆ శబ్దం వచ్చిందని స్పష్టమైంది. అప్పటికే ఐదుసార్లు 'ఐసీసీ అంపైర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు గెలిచిన సైమన్ టఫెల్ లాంటి గొప్ప అంపైర్ నిర్ణయాన్ని సవాలు చేయడం కూడా అప్పట్లో అంత తేలిక కాదని ద్రవిడ్ పేర్కొన్నాడు. కాగా, ఎంఎస్ ధోనీ కెప్టెన్సీలో జరిగిన ఆ సిరీస్‌ను భారత్ 4-0 తేడాతో ఘోరంగా ఓడిపోయింది. అయితే, ఆ సిరీస్‌లో ద్రవిడ్ అద్భుతంగా రాణించాడు. నాలుగు టెస్టుల్లో మూడు సెంచరీలతో 461 పరుగులు చేసి భారత జట్టులో టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

# వార్-2 ఎఫెక్ట్.. ఇక అవి ఆపేయాల్సిందే



రెబా మోనికా జాన్ యొక్క ఫ్యాషన్ అలలు సృష్టిస్తోంది



జూనియర్ ఎన్టీఆర్ బాలీవుడ్ డెబ్యూ మూవీ 'వార్-2' అతడికి ఉత్తరాదిన మంచి ఫాలోయింగ్ తెచ్చి పెడుతుందని, మార్కెట్‌ను విస్తరిస్తుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు అభిమానులు. కానీ ఆ చిత్రం బాక్సాఫీస్ దగ్గర దారుణంగా బోల్తా కొట్టింది. ఎన్టీఆర్‌కు తిరుగులేని ఫాలోయింగ్ ఉన్న తెలుగు రాష్ట్రాల్లో కూడా ఈ సినిమా ప్రభావం చూపలేకపోయింది. హిందీలో హృతిక్ స్టార్ పవర్ వల్ల ఓ మోస్తరుగా ఆడింది. ఇంకా థియేటర్లలో ఉన్నప్పటికీ.. ఈ సినిమా ఫైనల్ రిజల్ట్ డిజాస్టర్ అనడంలో సందేహాలేమే లేవు. ఓ భారీ, క్రేజీ ప్రాజెక్టుతో బాలీవుడ్లోకి తారక్ ఇవ్వాలనుకోవడం మంచి ఆలోచనే. యశ్ రాజ్ ఫిలిమ్స్, అయాన్ ముఖర్జీ, హృతిక్ రోషన్.. ఈ కాంబినేషన్ సూపరే. కానీ తారక్ ఎంచుకున్న జానర్, టైమింగ్ పెద్ద మైనస్ అయ్యాయి. యశ్ రాజ్ ఫిలిమ్స్ బేనర్ అంటే స్పై థ్రిల్లర్లకు కేరాఫ్ అడ్రస్. వైఆర్‌ఎఫ్ స్పై యూనివర్స్.. అంటూ ఒక కేటగిరీ పెట్టి మరీ వాళ్లు ఈ జానర్లో సినిమాలు తీస్తున్నారు. ఐతే ఏక్ థా టైగర్, వార్, పఠాన్ సినిమాల వరకు బండి బాగానే నడిచింది. ప్రేక్షకులు ఈ భారీ యాక్షన్ సినిమాలను బాగా ఆదరించారు. కానీ మొదట్లో కొత్తగా, ఎగ్జైటింగ్‌గా ఉన్నది ఏదైనా తర్వాత మొహం మొత్తడం మామూలే. కథలు మార్చకుండా ఇటు అటు తిప్పి భారీ యాక్షన్ జోడించి సినిమాలు తీస్తుండడంతో జనాలకు చిరాకు వచ్చేసింది. టైగర్-3 సినిమాను అలాగే తిరస్కరించారు. పాకిస్థాన్ నుంచి ఇండియాకు ముప్పు వాటిల్లడం.. హీరో రంగంలోకి దిగి శత్రు దేశం మిషన్‌ను భగ్నం చేయడం.. ఇలాంటి కథలు బాలీవుడ్లో లెక్కకు మిక్కిలి తెరకెక్కాయి. ఓవైపు యశ్ రాజ్ వాళ్లు, ఇంకోవైపు వేరే నిర్మాణ సంస్థలు ఇవే కథలు తీసి తీసి జనాలకు మొహం మొత్తేలా చేశారు. గత ఏడాది బడేమియా చోటేమియా, ఫైటర్ లాంటి సినిమాలు కూడా జనాల తిరస్కారానికి గురయ్యాయి. ఇలాంటి టైంలో 'వార్-2' సైతం అదే అరిగిపోయిన కథతో తెరకెక్కడం, రవ్వంతైనా కొత్తదనం లేకపోవడం, ఇలాంటి భారీ యాక్షన్ ఘట్టాలు చాలా సినిమాల్లో చూసి ఉండడంతో సినిమా ప్రేక్షకులను మెప్పించలేకపోయింది. ఈ సినిమాకు వచ్చిన ఫలితం చూశాక.. ఇక యశ్ రాజ్ వాళ్లు స్పై యూనివర్స్‌ను మూసేయక తప్పేలా లేదు.



సుప్రీత వార్డ్‌రోబ్ మీకు కావాల్సినవన్నీ

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com